RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

ఎస్సారెస్పీ తెలంగాణకే గర్వకారణం 2


| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 182 | ఆగస్టు 02 ఆదివారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 182 | August 02 Sunday2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


## భోగాపురం విమానాశ్రయంతో
# నూతన శకం

### అభివృద్ధి పథంలో ఉత్తరాంధ్ర... ఎయిర్ పోర్టును పారంభించిన మోడీ



**భోగాపురం జనసంఘర్షణ**
విజయనగరం జిల్లా భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఘనంగా ప్రారంభం కావడంతో ఉత్తరాంధ్ర ప్రాంతపు రూపురేఖలు మారి, ఒక కొత్త శకానికి నాంది పడింది. శనివారం నాటి వేడుకలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈ ప్రతిష్టాత్మక విమానాశ్రయం ప్రారంభమైంది. ఒకప్పుడు ఎర్రబస్సు కూడా సరిగా రాని ప్రాంతంలో నేడు ప్రపంచస్థాయి ఎయిర్‌బస్ దిగుతోందని, ఉత్తరాంధ్ర ఇకపై అభివృద్ధిలో 'ఉత్తమ ఆంధ్ర'గా మారబోతోందని ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఈ విమానాశ్రయ నిర్మాణం కోసం భూములిచ్చిన రైతుల త్యాగాలను ఆయన ప్రత్యేకంగా కొనియాడారు. ఉత్తరాంధ్రకు మణిహారంగా నిలిచే ఈ ప్రాజెక్టుకు విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టడం ఎంతో గర్వకారణమని, స్థానిక జీఎంఆర్ సంస్థ దీనిని నిర్మించడం ఈ ప్రాంతీయ సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెబుతోందని పేర్కొన్నారు. హైదరాబాద్ సమీపంలోని శంషాబాద్ విమానాశ్రయం ఏ విధంగానైతే తెలంగాణ ముఖచిత్రాన్ని మార్చివేసిందో, అదే రీతిలో భోగాపురం విమానాశ్రయం కూడా ఉత్తరాంధ్ర దశ, దిశను పూర్తిగా మార్చబోతోందని సీఎం ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రాంతీయ ప్రగతిని వివరించిన ముఖ్యమంత్రి, కేంద్ర ప్రభుత్వ సహకారంతో గత రెండేళ్లలో ఉత్తరాంధ్ర పరిధిలో 189 ప్రాజెక్టుల ద్వారా రూ. 6.13 లక్షల కోట్ల పెట్టుబడులను సమీకరించామని, వీటి ద్వారా దాదాపు 5.57 లక్షల మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని వెల్లడించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ సెంటిమెంట్‌ను కాపాడటంతో పాటు విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుకు ప్రత్యేక వెసులుబాటు కల్పించింది ప్రధాని మోదీయేనని కొనియాడారు. భవిష్యత్తులో ఈ ప్రాంతం పర్యాటక, ఫార్మా, జాతీయ రహదారులు, ఆధ్యాత్మిక కేంద్రంగా మారబోతోందని, ఫలితంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే పరిస్థితులు మారి ఇక్కడికే వలసలు వచ్చే రోజులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే, రాబోయే మూడేళ్లలో రూ. 2,784

## పేపర్ లీకేజీల నిరోధక బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

### కొత్త చట్టంగా అమలుకు మార్గం సుగమం



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**
దేశంలో పరీక్షా పత్రాల లీకేజీలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) అమెండ్‌మెంట్ బిల్, 2026' కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేశారు. పార్లమెంట్‌లోని ఉభయ సభలైన లోక్‌సభ, రాజ్యసభలు ఈ వారంలోనే ఆమోదించిన ఈ ప్రతిష్టాత్మక బిల్లు, రాష్ట్రపతి సంతకంతో ఇప్పుడు చట్ట రూపం దాల్చింది. ఇటీవల నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా ఢిల్లీలో జరిగిన నిరసనల నేపథ్యం, 2024లో తెచ్చిన పాత చట్టంలో ఉన్న లోపాలను సరిచేస్తూ మరింత కఠినమైన నిబంధనలతో ఈ

➢ మిగతా 2వ పేజిలో..

## వికసిత్ భారత్ దిశగా దేశం, ప్రగతి పథంలో ఏపీ

### భోగాపురం సభలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్



**భోగాపురం జనసంఘర్షణ**
విజయనగరం జిల్లా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ బహిరంగ సభలో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రసంగిస్తూ, 140 కోట్ల మంది భారత ప్రజల ఆకాంక్షలను ప్రధాని నరేంద్ర మోదీ నెరవేరుస్తున్నారని కొనియాడారు. దేశాన్ని 'వికసిత్ భారత్' దిశగా వేగంగా నడిపించేందుకు ప్రధాని ఒక్క రోజు కూడా సెలవు తీసుకోకుండా అహర్నిశలు శ్రమిస్తున్నారని

➢ మిగతా 2వ పేజిలో..

## రాష్ట్రానికి భారీ పెట్టుబడులే లక్ష్యంగా
# సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన

**హైదరాబాద్ జనసంఘర్షణ**
తెలంగాణ రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే ప్రధాన లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్వరలో విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు. ఆగస్టు 20 నుంచి సెప్టెంబర్ 8 వరకు దాదాపు 20 రోజుల పాటు ఆయన వివిధ దేశాల్లో పర్యటించనున్నారు. అమెరికా, బ్రిటన్ (యూకే) సహా పలు కీలక దేశాల్లో సీఎం పర్యటించనున్నట్లు సమాచారం. ఆయా దేశాల్లోని ప్రముఖ కంపెనీల ప్రతినిధుల అపాయింట్‌మెంట్ల ఆధారంగా సీఎం పర్యటన షెడ్యూల్ ఖరారవుతుంది. ఈ విదేశీ పర్యటనలో భాగంగా ప్రపంచ




➢ మిగతా 2వ పేజిలో..

## భద్రాచలం వద్ద
# నిలకడగా గోదావరి

### 56 అడుగులకు చేరిన నీటిమట్టం, మూడో ప్రమాద హెచ్చరిక కొనసాగింపు

**భద్రాచలం జనసంఘర్షణ**
భద్రాచలం వద్ద గోదావరి నది ఉగ్రరూపం దాల్చి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో నీటిమట్టం శనివారం ఉదయం 11 గంటల సమయానికి 56 అడుగులకు (దాదాపు 15,84,657 క్యూసెక్కులు) చేరి నిలకడగా కొనసాగుతోంది. రెండు



➢ మిగతా 2వ పేజిలో..

# భోగాపురం విమానాశ్రయంతో నూతన శకం

**మొదటిపేజీ తరువాయి..** కోట్లతో 8 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని, నేరడి బ్యారేజీ పనులతో పాటు గోదావరి-వంశధార నదుల అనుసంధానాన్ని వేగవంతం చేస్తామని తెలిపారు. 2027 నాటికి పోలవరం ప్రాజెక్టును, 2028 నాటికి అమరావతి తొలి దశను పూర్తి చేసి ప్రధాని చేతుల మీదుగానే జాతికి అంకితం చేస్తామని ప్రకటించారు. ఐటీ నుంచి ఏఐ వైపు ప్రపంచం వేగంగా అడుగులు వేస్తున్న తరుణంలో, భారత్‌ను ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో నాల్గో స్థానానికి చేర్చిన మోదీ వంటి సమర్థవంతమైన నాయకుడు దేశానికి దొరకడం ఎంతో అదృష్టమని ఆయన అభివర్ణించారు. విమానాశ్రయ టెర్మినల్‌ను ప్రారంభించిన అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ అక్కడ అందుబాటులోకి తెచ్చిన ఆధునిక ప్రయాణికుల సదుపాయాలు, సాంకేతిక వ్యవస్థలు, ఏవియేషన్ హబ్ మరియు ఏవియేషన్ ఎడ్యుసిటీ నమూనాలను ఆసక్తిగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర సంస్కృతి, ప్రముఖ పుణ్యక్షేత్రాలు మరియు సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించే కళాఖండాలను సీఎం చంద్రబాబు ప్రధానికి వివరించారు. సభా ప్రాంగణంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రధాని మోదీని పొందూరు ఖాదీ శాలువాతో సత్కరించగా, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌లతో కలిసి ఉత్తరాంధ్ర కళా వైభవానికి ప్రతీకగా నిలిచే బొబ్బిలి వీణను జ్ఞాపికగా అందజేశారు.

అనంతరం సభను ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాభివృద్ధికి, పారిశ్రామికంగా పెట్టుబడులను ఆకర్షించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు రాత్రింబవళ్లు పడుతున్న శ్రమను ప్రత్యేకంగా కొనియాడారు. రాష్ట్ర ప్రగతి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'డబుల్ ఇంజిన్ సర్కార్'గా సమన్వయంతో పనిచేస్తున్నాయని స్పష్టం చేశారు. పెట్టుబడులు పెరిగితే ఉత్పత్తి, ఎగుమతులు పెరిగి తద్వారా ఉపాధి అవకాశాలు విస్తరించి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని, అదే అభివృద్ధి నమూనాను ఇక్కడ అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి రాజు, కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, శ్రీనివాస వర్మ, పెమ్మసాని చంద్రశేఖర్, పలువురు రాష్ట్ర మంత్రులు మరియు ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వికసిత్ భారత్ దిశగా దేశం, ప్రగతి పథంలో ఏపీ

ప్రశంసించారు. దేశ పురోగతికి మౌలిక వసతుల కల్పనే అత్యంత కీలకమని గుర్తించిన మోదీ, విశాఖ రైల్వే జోన్‌ను మంజూరు చేసి ఆంధ్రప్రదేశ్ ప్రజల సుదీర్ఘ ఆకాంక్షను నెరవేర్చారని గుర్తుచేశారు. దేశ అభివృద్ధి కోసం శ్రమిస్తున్న క్రమంలో ప్రధాని మోదీ ఎన్నో విమర్శలు, అవమానాలు ఎదుర్కొన్నప్పటికీ ఎక్కడా భయపడకుండా ధైర్యంగా ముందుకు సాగారని పవన్ వ్యాఖ్యానించారు. "కాయలు కాసే చెట్టుకే రాళ్ల దెబ్బలు తగులుతాయి" అని పేర్కొంటూ, తనను తీవ్రంగా దూషించిన వారిని కూడా క్షమించే గొప్ప గుణం మోదీ సొంతమని చెప్పారు. ఇలాంటి సమర్థవంతమైన నాయకుడు దేశానికి లభించడం మనందరి అదృష్టమని అభివర్ణించారు. అదేవిధంగా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనుభవజ్ఞుడైన మార్గదర్శకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధిలో అగ్రగామిగా మారుతోందని పవన్ కళ్యాణ్ ధీమా వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర ప్రగతి ప్రయాణంలో భోగాపురం ఎయిర్‌పోర్ట్ నిర్మాణం ఒక సరికొత్త అధ్యాయానికి నాంది పలికిందని స్పష్టం చేశారు. "తెలుగుజాతి ఎవరికీ తలవంచదు" అని విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు గర్జించిన నేల ఇది అని పవన్ గుర్తుచేసుకున్నారు. ఈ చారిత్రాత్మక కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు నాయుడుతో పాటు పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎస్సారెస్పీ తెలంగాణకే గర్వకారణం:

ప్రాజెక్టును పరిశీలించిన మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ (ఎస్సారెస్పీ) ప్రాజెక్టును సందర్శించి, గోదావరి పరివాహక ప్రాంతాల్లోని ప్రాజెక్టుల పరిస్థితులపై సమగ్రంగా సమీక్షించారు. సుమారు 56 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణమని, ఇక్కడి ఆయకట్టు రైతులకు ఇది నిజమైన జీవనాడిగా నిలిచిందని ఆయన కొనియాడారు. ప్రాజెక్టులో ఏళ్ల తరబడి చేరిన పూడిక వల్ల నీటి నిల్వ సామర్థ్యం క్రమంగా తగ్గుతుండడాన్ని ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించిందని, దానిని తొలగించేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. వచ్చే రెండు రోజుల్లో ఎస్సారె-స్పీ నుంచి సాగునీటి విడుదలపై స్పష్టమైన ప్రకటన వెలువరిస్తామని చెప్పారు. అయితే, గత సంవత్సరంతో పోలిస్తే ప్రస్తుతం జలాశయంలో నీటి నిల్వలు కొంత తక్కువగా ఉన్నందున రైతాంగం ఈ పరిస్థితిని గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష బీఆర్ఎస్‌పై మంత్రి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో నీరు నింపకపోవడంపై బీఆర్ఎస్ కావాలనే దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. సాంకేతిక లోపాలు, డిజైన్ వైఫల్యాల వల్లే ఆ మూడు ప్రాజెక్టులు దెబ్బతిన్నాయని, వాటి పునరుద్ధరణ కోసం తమ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న శాస్త్రీయ చర్యలతో సెంట్రల్ వాటర్ కమిషన్ (సిడబ్ల్యూసి) కూడా పూర్తిగా ఏకీభవించిందని వివరించారు. దెబ్బతిన్న బ్యారేజీలను పునరుద్ధరించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అలాగే ప్రాణహిత-చేవెళ్ల పథకంలో భాగమైన ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌ను నిర్మించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని చెబుతూ, దాన్ని

# రాష్ట్రానికి భారీ పెట్టుబడులే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన

**మొదటిపేజీ తరువాయి..** ప్రఖ్యాత కంపెనీల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడి సంస్థలు మరియు ప్రవాస భారతీయులతో (ఎన్ఆర్ఐ) ముఖ్యమంత్రి వరుస సమావేశాలు నిర్వహించనున్నారు. ప్రధానంగా ఐటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డేటా సెంటర్లు, సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ తయారీ, లైఫ్ సైన్సెస్, ఫార్మా, గ్రీన్ ఎనర్జీ, ఏరోస్పేస్, డిఫెన్స్ తయారీ వంటి కీలక రంగాల్లో పెట్టుబడులను రాబట్టడమే ఈ పర్యటన యొక్క ముఖ్య ఉద్దేశం. అమెరికాలో చిప్ తయారీ, క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ కంపెనీలతోను.. లండన్‌లో గ్లోబల్ ఫైనాన్షియల్ ఇన్వెస్టర్లు, విద్యా సంస్థల ప్రతినిధులతోను ఆయన చర్చలు జరిపే అవకాశం ఉంది. అలాగే గతంలో జరిగిన ఒప్పందాల పురోగతిపై కూడా ఆయా సంస్థల ప్రతినిధులతో సీఎం సమీక్షించనున్నారు.

ఆగస్టు 17 లేదా 18న శాసనసభ ప్రత్యేక సమావేశం?

చట్టసభల్లోకి ప్రవేశించే కనీస వయస్సును 21 సంవత్సరాలకు తగ్గించాలనే ప్రతిపాదనపై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ అంశంపై తీర్మానం చేసేందుకు ఆగస్టు 17 లేదా 18 తేదీల్లో ఒక రోజు ప్రత్యేక అసెంబ్లీ సమావేశాన్ని నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు తెలుస్తోంది.

అలాగే, రాష్ట్ర వర్షాకాల అసెంబ్లీ సమావేశాలను సెప్టెంబర్ మూడో వారంలో వారం రోజుల పాటు నిర్వహించే అవకాశం ఉంది. ఆగస్టులో సీఎం విదేశీ పర్యటన ముగించుకుని సెప్టెంబర్ రెండో వారానికి తిరిగి రాష్ట్రానికి రానున్న నేపథ్యంలో, మూడో వారంలో సభ నిర్వహణపై సచివాలయంలో చర్చలు జరుగుతున్నాయి.

## ఆగస్టులో సెలవులివే..

ఈ ఆగస్టు నెల విద్యార్థులకు, ఉద్యోగులకు వరుస సెలవులతో మంచి ఊరటనివ్వనుంది. ప్రధాన పండుగలు, వారాంతపు సెలవులు ఒకేసారి రానుండటంతో రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ వరుసగా కొన్ని రోజులు హాలిడేస్ లభించనున్నాయి.

తెలంగాణలో ముఖ్యమైన సెలవుల వివరాలు:

ఆగస్టు 8, 9, 10 (వరుసగా 3 రోజులు): ఆగస్టు 8న రెండో శనివారం, 9న ఆదివారం కాగా.. 10న బోనాల పండుగ సందర్భంగా రాష్ట్రంలో పబ్లిక్ హాలిడే ఉంది. దీంతో వరుసగా మూడు రోజులు సెలవులు రానున్నాయి.

ఆగస్టు 26: మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ప్రభుత్వం పబ్లిక్ హాలిడేగా ప్రకటించింది.

ఆగస్టు 28: రక్షాబంధన్ (రాఖీ పండుగ) సందర్భంగా ఆప్షనల్ హాలిడే ఉంది.

ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమైన సెలవుల వివరాలు:

ఆగస్టు 21 (శుక్రవారం): శ్రీ వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో పబ్లిక్ హాలిడే ఉంది.

ఆగస్టు 25 (మంగళవారం): మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ప్రభుత్వం సెలవు ప్రకటించింది.

రెండు రాష్ట్రాలకూ ఉమ్మడి సెలవులు:

ఆగస్టు 15, 16 (శని, ఆదివారాలు): ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం (శనివారం) కాగా, మరుసటి రోజు 16న ఆదివారం కావడంతో రెండు రోజులు వరుసగా సెలవులు రానున్నాయి.

## త్వరలో నామినేటెడ్ పోస్టులు: తుమ్మల

**హైదరాబాద్ :** తెలంగాణలో నామినేటెడ్ పోస్టుల భర్తీ పక్రియ ప్రారంభమైందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సీఎం నిర్ణయాలకు అనుగుణంగా నియామకాలు జరుగుతాయన్నారు. ఆశావహులు తమ పేర్లను పీసీసీకి పంపాలని సూచించారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కార్పొరేషన్ ఛైర్మన్ల నియామకాలు త్వరలో చేపడతామన్నారు. వివిధ నామినేటెడ్ పోస్టుల భర్తీని దశలవారీగా పూర్తి చేస్తామని, సహకార సంఘాల పాలకవర్గాల పోస్టులను కూడా భర్తీ చేస్తామని పేర్కొన్నారు.

# భద్రాచలం వద్ద నిలకడగా గోదావరి

**మొదటిపేజీ తరువాయి..** రోజుల వ్యవధిలోనే సుమారు 50 అడుగులు దాటి ప్రవహిస్తుండటంతో అధికారులు మూడో ప్రమాద హెచ్చరికను జారీ చేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. నీటిమట్టం త్వరలోనే స్వల్పంగా తగ్గే అవకాశముందని అంచనా వేస్తున్నారు. వరద నీరు ప్రధాన రహదారులపైకి చేరడంతో భద్రాచలం నుంచి దుమ్ముగూడెం, చర్ల, వాజేడు, వెంకటాపురం, వి.ఆర్.పురం, వేలేరుపాడు తదితర ఏజెన్సీ మండలాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయి జనజీవనం అస్తవ్యస్తమైంది. ఈ పరిస్థితులపై రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పందిస్తూ జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఫోన్లో మాట్లాడి రెవెన్యూ, పోలీసు యంత్రాంగాన్ని తీవ్ర అప్రమత్తం చేశారు. భద్రాచలంలోకి వరద నీరు రాకుండా చూడాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ భద్రాచలంలోనే ఉండి సహాయక చర్యలను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. బాధితుల కోసం పినపాక, భద్రాచలం నియోజకవర్గాల పరిధిలో 49 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాగా, చర్ల మండలం వీరాపురం ఇసుక ర్యాంపు వద్ద గోదావరి వరద చుట్టుముట్టడంతో లారీ డ్రైవర్లు, సిబ్బంది కలిపి 46 మంది చిక్కుకుపోగా, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగి తెప్పల సహాయంతో వారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చాయి. ఈ రెస్క్యూ ప్రక్రియలో చర్ల సీఐ రాజువర్మ ప్రయాణిస్తున్న తెప్ప వరద తీవ్రతకు తలకిందులైనప్పటికీ, ఆయన చాకచక్యంగా తెప్పను పట్టుకుని ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. ప్రస్తుతం వరద ప్రభావిత ప్రాంతాల్లో రక్షణ బలగాలు నిరంతరం సహాయక చర్యల్లో నిమగ్నమై ఉన్నాయి.

# పేపర్ లీకేజీల నిరోధక బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

**మొదటిపేజీ తరువాయి..** కొత్త సవరణ బిల్లును కేంద్రం రూపొందించింది. కాంగ్రెస్ సహా పలు ప్రతిపక్ష పార్టీలు ఈ బిల్లుతో లీకేజీలను పూర్తిస్థాయిలో నిరోధించలేమని విమర్శించినప్పటికీ, పరీక్షల నిర్వహణలో పారదర్శకతను పెంచేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేస్తూ కేంద్రం దీనిని ఆమోదింపజేసింది. ఈ నూతన చట్టం ప్రకారం పేపర్ లీకేజీ నేరాలకు పాల్పడే వారిపై అత్యంత కఠినమైన శిక్షలు, భారీ జరిమానాలు విధించనున్నారు. కేసుల విచారణ వేగవంతం చేసేందుకు ప్రతి రాష్ట్రంలో ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసి, 90 రోజుల్లోనే విచారణ పూర్తి చేసి శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటారు. గతంలో ఉన్న రూ. 10 లక్షల వ్యక్తిగత జరిమానా పరిమితిని రూ. 50 లక్షలకు పెంచగా, వ్యవస్థీకృతంగా లేదా సంస్థల రూపంలో జరిగే అక్రమాలకు ఏకంగా రూ. 10 కోట్ల వరకు జరిమానా విధించేలా నిబంధనలను కఠినతరం చేశారు. అలాగే, జైలు శిక్ష కాలాన్ని గతంలో ఉన్న 3-5 ఏళ్ల నుంచి 5 నుండి 10 ఏళ్లకు పొడిగించారు. ఇకపై ఈ తరహా కేసుల దర్యాప్తు బాధ్యతలను కేంద్ర దర్యాప్తు సంస్థల స్థానంలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ (రాఖీ) టీంలకు అప్పగించనున్నారు. ఏళ్ల తరబడి విచారణలు సాగకుండా, దర్యాప్తు ప్రక్రియను కేవలం రెండు నెలల కాలపరిమితిలోనే పూర్తి చేయాలని ఈ కొత్త చట్టంలో స్పష్టమైన గడువును నిర్దేశించారు.

## ఎర్ర బస్సు వస్తుందా అన్న జగన్‌కు చెంపపెట్టు

### ఎయిర్ బస్సు వచ్చేలా చేసిన చంద్రబాబు: ఎమ్మెల్యే

**అనంతపురం :** భోగాపురానికి ఎర్ర బస్సు అయినా వస్తుందా అన్న జగన్.. భోగాపురానికి ఎయిర్ పోర్ట్ తానే తెచ్చానంటున్నారని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మండిపడ్డారు. అసలైన క్రెడిట్ చోర్ జగన్ రెడ్డి మాత్రమేనని ఆయన విమర్శించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీతో పాటు 'ఇంటింటికీ కూటమి ప్రభుత్వం'కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. భారీగా తరలివచ్చిన తెదేపా శ్రేణులు, కూటమి నాయకులతో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నంతరం ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ అనంతపురంలో ఓ పెద్ద మనిషి మెగా డీఎస్సీపై ఆరోపణలు చేస్తున్నారని.. ప్రతి రోజు ఏదో నిరసన అంటూ బయలుదేరుతున్నారని ఎద్దేవా చేశారు. జగన్ ఐదేళ్లలో అమరావతితో మూడు ముక్కలాట ఆడితే.. సీఎం

# మున్నూరు కాపు ఐక్యతే లక్ష్యం..

- మద్నూర్ మండల సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా బండివార్ హనుమండ్లు





మద్నూర్/, ఆగస్టు 1(జన సంఘర్షణ)

మద్నూర్: మున్నూరు కాపు సమాజ ఐక్యత, అభ్యున్నతి కోసం సేవలందించే లక్ష్యంతో బండివార్ హనుమండ్లును మున్నూరు కాపు సంఘం మద్నూర్ మండల సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా నియమించింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు ఆయనకు అభినందనలు తెలియజేసి, బాధ్యతలను విజయవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. మనియామక అనంతరం బండివార్ హనుమండ్లు మాట్లాడుతూ, గ్రామ, మండల స్థాయిలో సోషల్ మీడియా వ్యవస్థను మరింత బలోపేతం చేసి మున్నూరు కాపుల ఐక్యతను పెంపొందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. సమాజ ఆర్థిక, సామాజిక, రాజకీయ అభివృద్ధితో పాటు రిజర్వేషన్ల సాధన కోసం సంఘం చేపడుతున్న ఉద్యమాన్ని మరింత విస్తృత స్థాయికి తీసుకెళ్లేందుకు తన వంతు పాత్రను సమర్థవంతంగా పోషిస్తానని పేర్కొన్నారు. ఈ బాధ్యతను తనకు అప్పగించిన సంఘం రాష్ట్ర, జిల్లా, మండల నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసిన ఆయన, "మున్నూరు కాపు సమాజ అభ్యున్నతే నా లక్ష్యం. సమాజ ప్రయోజనాల కోసం అంకితభావంతో పనిచేస్తూ ప్రతి కార్యకర్తను కలుపుకొని ముందుకు సాగుతాను" అని అన్నారు. ఈ నియామకం పట్ల మున్నూరు కాపు సంఘం నాయకులు, కార్యకర్తలు, యువత హర్షం వ్యక్తం చేస్తూ బండివార్ హనుమండ్లుకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నాయకత్వంలో మద్నూర్ మండలంలో సంఘ కార్యకలాపాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.

## క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10, జైల్ భరో విజయవంతం చేయండి



మంచిర్యాల జిల్లా, చెన్నూరు మండలం, ఆగష్టు 01(జనసంఘర్షణ):

చెన్నూరు మండలంలో సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆగస్టు 10 జైలు బరో విజయవంతం చేయాలని కరపత్రం ఆవిష్కరించడం జరిగింది. ఈ సదస్సులో బోడంకి చందు రైతు సంఘం, జిల్లా కార్యదర్శి హాజరై మాట్లాడుతూ.. భారత వ్యవసాయ రంగంలోకి కేంద్ర బిజెపి ప్రభుత్వం స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలు చేసుకుందని, జీరో సుంకాలతో దిగుమతులు రావడంతో దేశీయ వ్యవసాయ ఉత్పత్తుల ధరలు తగ్గిపోయి రైతులు దివాలా తీస్తున్నారని, కార్మిక వర్గం స్వాతంత్రం రాక ముందే పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు రద్దుచేసి దేశంలో పెట్టుబడిదారులకు, కార్పొరేట్లకు లాభాలను చేకూర్చడం కోసం కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లను తీసుకొచ్చారు. కేంద్రంలో యూపీఏ కాంగ్రెస్ ప్రభుత్వం 2005లో ఉన్నప్పుడు వామపక్షాల పోరాట ఫలితంగా"మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి గ్యారెంటి చట్టం"అమలు చేయబడ్డది. నేడు అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మహాత్మా గాంధీ పేరును తొలగించి దీని స్థానంలో"వికసిత్ భారత్ (గ్రామ్, జీ"(వి బి జి,రామ్ జీ) మార్పు చేయడమే కాక, రాష్ట్రాల వాటా 10, శాతం నుండి,40 శాతం నిధులను భరించాలని రాష్ట్రాల మీద భారం రుద్దాలని,కేంద్ర ప్రభుత్వం ఇదే అదునుగా భావించి మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పనిని ఎత్తివేయాలని కుట్రలు చేస్తుంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ విధానాలకు వత్తాసు పలుకుతా ఉంది. అందులో భాగంగా 10 గంటల జి .ఓ తీసుకొచ్చింది. ప్రజా,కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టడానికి ఈ నెల ఆగస్టు 10, తేదీన జైల్ బరో కార్యక్రమానికి పెద్ద ఎత్తున వ్యవసాయ కూలీలు, ఉపాధి కూలీలు రైతులు ,కార్మికులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమారాణి, కరింభీ సిఐటియు నాయకురాలు, కృష్ణమాచారి, సమ్మక్క వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, కార్మిక సంఘాల నాయకులు యామిని, మల్లికార్జున్, గట్టక్క, మౌనిక, దుర్గమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## టిఆర్‌పి సభ్యత్వం కార్యక్రమం విజయవంతం

- అశ్వరావుపేట మండలంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ సమావేశం
- పలువురు పార్టీలో చేరిక



1-8-2026 జన సంఘర్షణ

ఈరోజు తెలంగాణ రాజ్యాధికార పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మండలాల పర్యటనలో భాగంగా జిల్లా అధ్యక్షులు మల్లెల వీరనారాయణ ఆధ్వర్యంలో, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ గట్ల రాజన్న తో కలిసి అశ్వరావుపేట మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా అశ్వరావుపేట మండల అధ్యక్షులు పంబి ప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు మల్లెల వీరనారాయణ గారు పార్టీ సభ్యత్వ నమోదు, పార్టీ అభివృద్ధి, సంస్థాగత బలోపేతంపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ గట్ల రాజన్న వెలుగు పుల్లారావు, పచ్చ మాధవరావు, మంకెన ప్రసాద్, ఈదర శ్రీరాములు, ఈదర సాయి తదితరులకు పార్టీ కండువా కప్పి తెలంగాణ రాజ్యాధికార పార్టీలోకి ఆహ్వానించారు. తదుపరి మండల అధ్యక్షులు, కార్యదర్శులను జిల్లా అధ్యక్షులు మరియు జిల్లా ఇన్‌చార్జ్ శాలువాలతో సన్మానించారు. వారికి ప్రతిగా స్థానిక నాయకులు కూడా మర్యాదపూర్వకంగా శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర ప్రశాంత్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షురాలు వడ్లానపు తిరుపతమ్మ, అశ్వాపురం మండల అధ్యక్షులు విలాసాగరం కోటేశ్వరరావు, అశ్వరావుపేట మండల ప్రధాన కార్యదర్శి వంశి గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గట్ల రాజన్న మాట్లాడుతూ.. మండలాలు గ్రామాల్లో పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు తీన్మార్ మల్లన్న ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా మెదక్ మున్సిపాలిటీ పరిధిలోని బూతులను పరిశీలించిన బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు





ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్ట్ 2(జన సంఘర్షణ)

మెదక్ మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు పట్టణములోని పలు పోలింగ్ బూతులను సందర్శించి జరుగుతున్న ఎన్యుమరేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ నంబర్లు 152, 146, 147, 138, 139, 157, 166, 173, 133లను వీటిలో కొన్ని బూతుల్లో 100 శాతం, మరికొన్ని బూతుల్లో 99 శాతం, 98 శాతం మేర ఎన్యుమరేషన్ పూర్తి కావడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా రాగి రాములు మాట్లాడుతూ.. భారతీయ జనతా పార్టీ బీఎల్ఏ-2లు,బూత్ అధ్యక్షులు,శక్తి కేంద్ర ఇన్‌చార్జీలు,పార్టీ కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి ఎన్యుమరేషన్ ప్రక్రియను 100 శాతం పూర్తి చేయాలనే లక్ష్యంతో నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. బీఎల్ఓలు కూడా పూర్తి స్థాయిలో సహకరిస్తూ ప్రక్రియను విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్నారని కొనియాడారు. ఇంకా పూర్తి కాని బుతులలో ఓటర్లను గుర్తించి, వారిని సంప్రదించి తప్పనిసరిగా ఎన్యుమరేషన్ పూర్తి చేయాలని బీఎల్ఓలు, బీఎల్ఏ-2లకు సూచించినట్లు తెలిపారు. ప్రతి అర్హుడైన ఓటరు వివరాలు నమోదు అయ్యేలా సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. గత నెల రోజులుగా భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు తమ వ్యక్తిగత సమయాన్ని వెచ్చిస్తూ ప్రతి బూతులో ఎన్యుమరేషన్ కార్యక్రమానికి సహకరిస్తున్నారని, వారి సేవలు అభినందనీయమని అభినందచ్చారు. ప్రజాస్వామ్యాన్ని ఈ కార్యక్రమంలో మెదక్ పట్టణ అధ్యక్షులు నాయన ప్రసాద్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి నాగరాజు, జిల్లా నాయకులు భిక్షపతి, కిషన్, బూత్ అధ్యక్షులు, బీఎల్ఏ-2లుపార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రుద్రూర్ ఆరోగ్య కేంద్రంలో మొక్కల నాటకం కార్యక్రమం ఘనంగా ప్రారంభం





రుద్రూర్: /ఆగస్టు 1/(జన సంఘర్షణ)

నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మొక్కల నాటకం కార్యక్రమాన్ని వైద్యాధికారి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రం సిబ్బందితో కలిసి పలు రకాల మొక్కలను నాటుతూ పచ్చదనం పెంపొందించాల్సిన అవసరాన్ని వివరించారు. వైద్యాధికారి మాట్లాడుతూ.. "ఒక్కో వ్యక్తి ఒక్కో మొక్కను నాటి, దానిని సంరక్షిస్తే పర్యావరణ పరిరక్షణతో పాటు భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించగలుగుతాం" అని అన్నారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో పచ్చదనం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని మొక్కలను నాటి వాటి సంరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. "మొక్కలు నాటడం మాత్రమే కాదు, వాటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత" అనే సందేశంతో కార్యక్రమం తదితరులు పాల్గొన్నారు.

## రెండు వారాల్లో డ్రంకెన్ డ్రైవ్‌పై 346 కేసులు

- రూ.32.60 లక్షల జరిమానా విధింపు: పోలీస్ కమిషనర్ సాయి చైతన్య




నిజామాబాద్/, ఆగస్టు 1/( జన సంఘర్షణ)

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై పోలీసులు చేపట్టిన ప్రత్యేక డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో గత రెండు వారాల్లో 346 మంది పట్టుబడ్డారని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తెలిపారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ..నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ల పరిధిలోని పోలీస్ స్టేషన్లు, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో 346 మందిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. పట్టుబడిన వారిని న్యాయస్థానంలో మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా, మొత్తం రూ.32,60,000 జరిమానా విధించినట్లు వెల్లడించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సీపీ సాయి చైతన్య సూచించారు. అలాగే డ్రంకెన్ డ్రైవ్‌పై ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని హెచ్చరించారు.

## జల్లాపల్లి కొత్తబడి కోడ్-280లో తల్లిపాలపై అవగాహన కార్యక్రమం





పోతంగల్/ఆగస్టు 1/(జన సంఘర్షణ)

జల్లాపల్లి: ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా జల్లాపల్లి కొత్తబడి (కోడ్-280)లో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తల్లులకు తల్లిపాల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. పుట్టిన శిశువుకు మొదటి గంటలోనే తల్లిపాలు ఇవ్వడం ఎంతో అవసరమని, మొదటి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలే ఉత్తమ ఆహారమని తెలిపారు. తల్లిపాలు శిశువుకు అవసరమైన పోషకాలు, రోగనిరోధక శక్తిని అందించి ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు దోహదపడతాయని వివరించారు. అలాగే తల్లిపాలు ఇవ్వడంపై ఉన్న అపోహలను తొలగించుకొని ప్రతి తల్లి తన బిడ్డకు తప్పనిసరిగా తల్లిపాలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొని తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన పెంపొందించుకున్నారు.

## సాలూర సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం..

- యువకుడు మృతి



సాలూర,/ ఆగస్టు 1/( జన సంఘర్షణ)

సాలూర మండలం సాలూర క్యాంపు సమీపంలో జరిగిన విషాదకర రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను రూరల్ ఎస్సై రాజశేఖర్ వెల్లడించారు. బిలోలి తాలూకా కార్ల గ్రామానికి చెందిన షైక్ అహ్మద్ (30) తన స్నేహితుడు పింజారి ఇర్ఫాన్తో కలిసి బోధన్ ఉర్సు ఉత్సవాలకు హాజరై స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా, సాలూర క్యాంపు సమీపంలో వారి ద్విచక్ర వాహనం ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో షైక్ అహ్మద్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన ఇర్ఫాన్‌ను మహారాష్ట్రలోని శంభాజీనగర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు రూరల్ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఈ ఘటనతో మృతుడి కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
ఆదివారం
02 ఆగస్టు 2026

# రాయన్‌పల్లి అంశంపై మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డికి కాంగ్రెస్ నేతల కౌంటర్

- **బ్రిడ్జి కుంగిపోవడానికి బీఆర్ఎస్ పాలనలో ఇసుక దోపిడీయే కారణమని ఆరోపణలు**
- **ఎమ్మెల్యే రోహిత్‌రావు అభివృద్ధికి కట్టుబడి ఉన్నారని వెల్లడి.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 2: (జన సంఘర్షణ)
రాయన్‌పల్లి ధోని, కట్ట, బ్రిడ్జి అంశంపై మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను మెదక్ కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మెదక్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మందుగుల గంగాధర్, మెదక్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మార్గం నాగరాజు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఈగ రాజు మాట్లాడుతూ.. పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో రాయన్‌పల్లి సమస్యలు ఎందుకు గుర్తుకు రాలేదని ప్రశ్నించారు. రాయన్‌పల్లి బ్రిడ్జి కుంగిపోవడానికి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన విస్తృత ఇసుక దోపిడీయే ప్రధాన కారణమని ఆరోపించారు. కాల్వ, బ్రిడ్జి పరిసరాల్లో వందలాది ట్రాక్టర్లతో ఇసుక తరలించడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని, దీనికి అప్పటి పాలకులే బాధ్యత వహించాలని పేర్కొన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు సమస్యను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని మంత్రులు, అధికారులతో చర్చలు జరిపి రైతులు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా రూ.2.31 కోట్ల నిధుల మంజూరుకు చర్యలు చేపడుతున్నారని తెలిపారు. అలాగే ఎమ్మెల్యే స్థాపించిన మీఅూ స్వచ్ఛంద సంస్థ ద్వారా గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి సహకారం అందిస్తున్నారని పేర్కొన్నారు.ప్రజల సంక్షేమమే లక్ష్యంగా అవినీతికి తావులేకుండా పాలన కొనసాగిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావుపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని హెచ్చరించారు. బీఆర్ఎస్ పాలనలో ఇసుక దోపిడీ, అసైన్డ్ భూముల అక్రమాలు, అభివృద్ధి నిధుల దుర్వినియోగంతో నియోజకవర్గం వెనుకబడిందని విమర్శించారు.మెదక్ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఎమ్మెల్యే రోహిత్‌రావు కృషి చేస్తున్నారని, ఏడుపాయల దేవస్థానం,మెదక్ కోట,మెదక్ చర్చి వంటి ప్రముఖ పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించడం జరుగుతోందని చెప్పారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు స్పష్టంగా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు.మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి



అనవసర విమర్శలు మానుకోవాలని, ప్రజల ఆదరణ పొందుతున్న యువ ఎమ్మెల్యేపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేస్తే ప్రజాక్షేత్రంలో తగిన సమాధానం ఎదురవుతుందని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. ఈ సమావేశంలో మెదక్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మామిడి యాదగిరి గౌడ్, తిమ్మానగర్ సర్పంచ్ యాదగిరి, మంబోజిపల్లి సర్పంచ్ మానస రాములు, కాజీపల్లి సర్పంచ్ కొంగరి యాదగిరి, కాంగ్రెస్ నాయకులు బుదయ్య, నర్సింలు, యాదగిరి, చింతల వెంకట్, విజయ్, సాయిబాబా, ఎం ఎస్ ఎస్ ఓ నాయకులు మధు పటేల్, చింతకింది మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

- **మెదక్ జిల్లా వ్యాప్తంగా పోలీసుల పరిశుభ్రత కార్యక్రమం.**
- **5S విధానంతో పోలీస్ స్టేషన్లలో క్రమబద్ధీకరణ.**
- **పరిశుభ్రమైన పోలీస్ స్టేషన్ ప్రజలకు మెరుగైన సేవలకు నాంది: జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 1(జన సంఘర్షణ)
మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంతో పాటు జిల్లా పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో శనివారం ఫటీగ్ డ్యూటీలో భాగంగా ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ ఆవరణలు, కార్యాలయ పరిసరాలు, రికార్డు గదులు, సందర్శకులు వేచి ఉండే ప్రదేశాలు, పార్కింగ్ ప్రాంతాలను శుభ్రపరిచారు. కార్యాలయాల్లోని ఫైళ్లు, రికార్డులను క్రమబద్ధీకరించి 5ఎ విధానంను అమలు చేశారు. అంతేకాకుండా మొక్కలు నాటి, ఇప్పటికే ఉన్న మొక్కలకు నీరు పోసి వాటి సంరక్షణ చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పరిశుభ్రత అనేది ఒక్కరోజు నిర్వహించే కార్యక్రమం కాదు. అది ప్రతి ఒక్కరి దైనందిన బాధ్యత. పరిశుభ్రమైన, క్రమబద్ధమైన పోలీస్ స్టేషన్ ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు వేగవంతమైన, నాణ్యమైన పోలీసు సేవలు







అందించడానికి దోహదపడుతుంది.ఫటీగ్ డ్యూటీలో భాగంగా చేపట్టే పరిశుభ్రత కార్యక్రమాలు, రికార్డుల క్రమబద్ధీకరణ, 5ఎ విధానం అమలు వల్ల కార్యాలయాల పనితీరు మరింత మెరుగుపడుతుంది. ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది తమ పోలీస్ స్టేషన్‌ను పరిశుభ్రంగా, పచ్చదనంతో, క్రమశిక్షణతో నిర్వహించడం తమ బాధ్యతగా భావించి పనిచేయాలి" అని సూచించారు.పోలీస్ స్టేషన్లలో పరిశుభ్రతను నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని, కార్యాలయ రికార్డులు, ఫైళ్లను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని, ప్రభుత్వ ఆస్తులను సంరక్షించాలని, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కల పెంపకం, వాటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్పీ తెలిపారు. పరిశుభ్రమైన కార్యాలయ వాతావరణం ఉద్యోగుల పనితీరును మెరుగుపరచడంతో పాటు ప్రజలకు మరింత పారదర్శకమైన, సమర్థవంతమైన,నాణ్యమైన పోలీసు సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లాలో దివ్యాంగులకు సంబంధించి యూడీఐడీ కార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలి

- **పెండింగ్ అప్లికేషన్స్ లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు నగేష్ ఆదేశించారు.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 1 (జన సంఘర్షణ)
శనివారం సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి యూడీఐడీ కార్డుల జారీ పురోగతి, పాఠశాల విద్యార్థులకు యూనిఫాం కుట్టే పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ..రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15న కొత్త పింఛన్ల పంపిణీకి సిద్ధమవుతున్న నేపథ్యంలో యూడీఐడీ దరఖాస్తుల పెండింగ్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ లేకుండా వేగంగా పరిష్కరించాలని అధికారులకు ఆమె ఆదేశించారు. యూడీఐడీ దరఖాస్తులు నిరీక్షణలో ఉండకుండా సకాలంలో పరిష్కరించాలని సూచించారు. అలాగే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూనిఫాంల కుట్టింపు పనులను మరింత వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. యూనిఫాంల నిర్దేశించిన విధంగా నాణ్యతతో కుట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. మెదక్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) నగేష్ పాల్గొన్నారు. విడియో కాన్ఫరెన్స్ అనంతరం అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ,, జిల్లాలో పెండింగ్‌లో ఉన్న యూడీఐడీ దరఖాస్తులను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. యూడీఐడీ దరఖాస్తులు అనవసరంగా పెండింగ్‌లో ఉండకుండా ప్రతి దరఖాస్తును సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 2025 మార్చి 1 నుంచి ఇప్పటివరకు మొత్తం 1523 యూడీఐడీ కార్డులు జారీ చేయగా, ప్రస్తుతం 13 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. సంబంధిత అధికారులు ప్రత్యేక



దృష్టి సారించి పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్డిఓ శ్రీనివాసరావు, అడిషనల్ డిఆర్డిఓ సరస్వతి, జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, మెప్మా పీడీ హనుమంత్ రెడ్డి సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పోలంపల్లిలో బీఎల్‌వోలు, బీఎల్‌ఏలకు ఘన సన్మానం

- **శాతం వంద లక్ష్య సాధనలో ప్రతిభ కనబర్చిన ఎన్నికల సిబ్బందికి అభినందనలు**




సింగరేణి ప్రతినిధి: (జన సంఘర్షణ) న్యూస్
సింగరేణి మండలం పోలంపల్లి గ్రామపంచాయతీలో ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక కార్యక్రమంలో గ్రామంలోని రెండు పోలింగ్ కేంద్రాల్లో శాతం వంద లక్ష్యాన్ని విజయవంతంగా పూర్తి చేసిన బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు), బూత్ స్థాయి ప్రతినిధులు (బీఎల్‌ఏలు)ను గ్రామ సర్పంచ్ ధారావత్ హేమలత--బాలాజీ, మాజీ సర్పంచ్ ధారావత్ బద్రునాయక్ ఘనంగా సన్మానించారు. గ్రామంలో బీఎల్‌వోలుగా విధులు నిర్వహించిన అంగన్‌వాడీ ఉపాధ్యాయులు అనంతలక్ష్మి, ఈసం లీలావతి, బీఎల్‌ఏలుగా సేవలందించిన ధారావత్ వినాయక్, ఈసం వెంకటలక్ష్మిలకు శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికల సంఘం నిర్దేశించిన లక్ష్యాన్ని గ్రామంలోని రెండు పోలింగ్ కేంద్రాల్లో శాతం వంద పూర్తిచేయడం అభినందనీయమని కొనియాడారు. ఈ విజయంలో కృషి చేసిన ఎన్నికల సిబ్బంది సేవలను ప్రశంసిస్తూ, భవిష్యత్తులో కూడా ఇదే అంకితభావంతో ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, ఎన్నికల సిబ్బంది, గ్రామస్థులు పాల్గొని సన్మాన గ్రహీతలకు శుభాకాంక్షలు తెలిపారు.

# నిజామాబాద్ జిల్లా ఇంచార్జ్ కలెక్టర్‌గా భవేష్ మిశ్రా నియామకం




నిజామాబాద్:/ ఆగస్టు 1/(జన సంఘర్షణ)
నిజామాబాద్ జిల్లా ఇంచార్జ్ కలెక్టర్‌గా భవేష్ మిశ్రాను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు శుక్రవారం అధికారిక ఉత్తర్వులు విడుదల చేశారు. ప్రస్తుతం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మెటర్నిటీ సెలవుపై వెళ్లనున్న నేపథ్యంలో, ఆమె గైర్హాజరీలో 55 రోజుల పాటు జిల్లా పాలన బాధ్యతలను భవేష్ మిశ్రా నిర్వహించనున్నారు. అయితే, ఆగస్టు 6వ తేదీ వరకు అదనపు కలెక్టర్ భుజంగారావు ఇంచార్జ్ కలెక్టర్‌గా కొనసాగుతారు. అనంతరం ఆగస్టు 6 నుంచి భవేష్ మిశ్రా అధికారికంగా నిజామాబాద్ జిల్లా ఇంచార్జ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ నియామకంతో జిల్లా పరిపాలనా వ్యవహారాలు నిరంతరాయంగా కొనసాగేందుకు ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేసినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

# సర్ గడువు మరోసారి ఆగస్టు 10 వరకు పొడిగింపు

- **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**



ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 1 (జన సంఘర్షణ)
ఓటర్ ప్రత్యేక సవరణ గడువును ఆగస్టు 10 వరకు ఎన్నికల సంఘం పొడిగించిందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. అర్హత గల ఓటర్లు అందరూ సర్ లో నమోదు చేసుకొని, అనర్హులు, మరణించిన వారు, ఒకే ఓటరు రెండు సార్లు ఓటరు గా నమోదు అయిన వారిని తొలగించాలన్నారు. సర్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి 100 శాతం సర్ నమోదు చేయాలని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

**సవరించిన సర్ షెడ్యూల్ :**
ఎన్యూమరేషన్ ఫారమ్‌ల సమర్పణకు చివరి తేదీ: 10-08-2026 పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పునర్వ్యవస్థీకరణ: 10-08-2026 ముసాయిదా ఓటరు జాబితాల ప్రచురణ: 17-08-2026 క్లెయిమ్‌లు అభ్యంతరాల స్వీకరణ కాలం: 17-08-2026 నుండి 16-09-2026 వరకు క్లెయిమ్‌లు మరియు అభ్యంతరాల పరిష్కారం (నోటీసు కాలం): 17-08-2026 నుండి 15-10-2026 వరకు తుది ఓటరు జాబితాల ప్రచురణ: 19-10-2026 ఉంటుందన్నారు.

# ప్రజా రచయితగా గుర్తింపు

- **పేదలు, దళితులు, కార్మికుల జీవితాలను ప్రతిబింబిస్తూ గొప్ప రచయితగా ఖ్యాతి పొందారు**





పోతంగల్/ఆగస్టు 1/(జన సంఘర్షణ)
పోతంగల్ మండల కేంద్రంలో దళితుల విముక్తికి అంబేద్కర్ ప్రేరణను మార్గమే శరణ్యమని ఆయన గ్రహించారు. తన ప్రసిద్ధ 'ఫకీరా' నవలను కూడా ఆయన బాబాసాహెబ్ అంబేద్కర్ అచంచలమైన త్యాగాలకు అంకితం ఇచ్చారు.ఈ భూమి పండే పురాణాలలోని శేషనాగు తలపై నిలబడలేదు. అనాగరిక కార్మికుల మరియు దళితుల అచేతుల శ్రమపై నిలబడింది" అని అన్నా భౌ సాటే గారు చెప్పారు, దళిత సాహిత్యానికి పునాది - దళిత సాహిత్య ఉద్యమానికి బలమైన దిశను చూపిన ప్రముఖుల్లో ఒకరిగా నిలిచారు. కార్మికుల హక్కుల కోసం పోరాటం - కార్మికులు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం నిరంతరం ఉద్యమించారు. సమాజంలో కుల వివక్ష ఉన్నంత కాలం దేశానికి నిజమైన స్వాతంత్ర్యం సిద్ధించదని, ప్రతి ఒక్కరికీ చట్టబద్ధమైన సమాన హక్కులు, గౌరవం లభించినప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం సాధ్యమవుతుందని ఆయన అంతర్జాతీయ వేదికలపై పునరుద్ఘాటించారు. కష్టాల్లో పుట్టినా, ప్రతిభతో ప్రపంచం గుర్తించే స్థాయికి ఎదగవచ్చని తన జీవితంతో నిరూపించిన మహనీయుడు అన్నా బాహు సాటే జయంతి సందర్భంగా ఆ మహనీయునికి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు సంజు, గ్రామ సర్పంచ్ కాంత సునీల్, సర్పంచ్ యాదవ్, ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బొమ్మా బొరుసు ఆడుతున్న 9 మంది అరెస్టు

- **రూ.7,910 నగదు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం.**
- **మెదక్ జిల్లా ఎస్పీ.డి.వి. శ్రీనివాస రావు.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 1 (జన సంఘర్షణ)



మెదక్ మండలంర్యాలమడుగు గ్రామంలో కల్లు దుకాణం వెనుకవైపు బొమ్మా బొరుసు ఆడుతున్న స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా బొమ్మా బొరుసు ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.7,910 నగదు,ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.అరెస్టయిన వారిలో శేఖర్, యాదగిరి, చంద్రశేఖర్, ప్రవీణ్, చంద్రం, కిష్టయ్య,పోలె లక్ష్మణ్, దుర్గేష్, నిఖిల్ ఉన్నారు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, మాట్లాడుతూ జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలు, జూదం, పేకాట, బొమ్మా బొరుసు వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత జూదం, బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని, ఇలాంటి కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ప్రజల భద్రతకు విఘాతం కలిగించే కార్యకలాపాలపై నిరంతరం నిఘా కొనసాగుతుందని ఎస్పీ తెలిపారు.

# మాజీ ఎమ్మెల్యే మాటలు విడ్డూరం

◆ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగరాజు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 1 (జన సంఘర్షణ)




మెదక్ మండలం రాయిన్‌పల్లి చెరువు కట్టపై మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి మాట్లాడం విడ్డురంగా ఉన్నాయని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మార్గం నాగరాజు పేర్కొన్నారు. శనివారం మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ పట్టణాధ్యక్షుడు గంగాధర్, సీనియర్ నాయకుడు ఈగరాజుతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి రాయన్ పల్లి విషయంలో మాట్లాడం విడ్డూరంగా ఉందని హేళన చేశారు. పది సంవత్సరాల టిఆర్ఎస్ పాలనలో రాయన్ పల్లి చేరువుకట్ట బ్రిడ్జ్ గుర్తుకు రాలేదా రాయినపల్లి బ్రిడ్జ్ కుంగిపోవడానికి కారణం అప్పటి బి ఆర్ ఎస్ ప్రభుత్వమే అని గుర్తుతెచ్చుకోవాలని అన్నారు.వందల కొద్ది ట్రాక్టర్లతో రాయిన్ పల్లి కాల్వలో బ్రిడ్జ్ పరిసర ప్రాంతాల్లో ఇసుక దోపిడీ చేసిన కారణంగానే ఆ బ్రిడ్జి కుంగిపోవడం జరిగిందని దానికి బాధ్యత పది సంవత్సరాలు పరిపాలనలో ఉన్న పద్మాదేవేందర్ రెడ్డి గారి బాధ్యత వహించాలని గుర్తు చేశారు. ఎమ్మెల్యే మైనపల్లి రోహిత్ తక్షణమే స్పందించి మంత్రులతో అధికారులతో మాట్లాడి రైతులకు ప్రజలకు ఇబ్బంది కాకుండా 2.31 కోట్ల రూపాయలు మంజూరీకి ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నారని చెప్పారు.ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ స్థాపించిన ఎంఎస్ ఎస్ఓ స్వచ్ఛంద సంస్థ ద్వారా నిధులు సమకూరుస్తూ గ్రామాలు ఇటు పట్టణాల అభివద్ధికి బాటలు వేస్తున్నారనిన్నరు.యువకుడు ప్రజలేనా ప్రాణం అంటూ మెదక్ నియోజకవర్గ అభివద్ధి బాటలో వుండాలని నిరంతరం కషి చేస్తున్నారని ఎమ్మెల్యే పట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తే నియోజకవర్గ ప్రజలు మీకు తగిన శాస్తి చేస్తారని మండిపడ్డారు. అవినీతికి తావు లేకుండా ప్రజా పాలన కొనసాగించడంలో ఎమ్మెల్యే కృత నిశ్చయంతో ముందుకు వెళుతున్నరాని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పది సంవత్సరాల పరిపాలనలో ఇసుక దోపిడీ, అసైన్డ్ భూములు, నిధులు స్వాహా నియోజకవర్గాన్ని అభివద్ధికి దూరం చేసింది మీరు కాదా అని ప్రశ్నించారు. నియోజకవర్గంలో ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటూ ఏడుపాయల దేవస్థానం అయితే కాకతీయుల కాలం ఖిల్లా ప్రపంచప్రఖ్యాతి గాంచిన మెదక్ చర్చికినిధులు కేటాయించి అభివద్ధికి పట్టం కట్టారని ఈ అభివద్ధి మీ కళ్ళకు కనిపిస్తే లేదా ప్రశ్నించారు. మెదక్ ప్రాంతని టూరిజం హబ్ గాతీర్చడానికి ఎమ్మెల్యే నిరంతరం కషి చేస్తున్నారని గుర్తు చేశారు. మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి ఖబర్దార్ అనవసరంగా ఆణిముత్యం లాంటి యువ ఎమ్మెల్యే మాట్లాడితే ప్రజాక్షేత్రంలో మీరు దోషిగా మారుతారని మిగిలేది ఏమీ ఉండదని గుర్తు చేశారు.ఈ మీడియా సమావేశంలో మెదక్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు మామిడి యాదగిరి గౌడ్ తిమ్మా నగర్ సర్పంచ్ యాదగిరి మంబోజి పల్లి సర్పంచ్ మానస రాములు ఖాజీపల్లి సర్పంచ్ కొంగరి యాదగిరి సీనియర్ కాంగ్రెస్ నాయకులు బుదయ్య నర్సింలు యాదగిరి, చింతల వెంకట్, విజయ్, సాయిబాబా, ఎంఎస్ఎస్ ఓ నాయకులు మధు పటేల్, చింతకింది. మల్లయ్య తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎన్ని సైలెంట్ చెయ్ అన్న

◆ భూక్య రంజిత్ కుమార్ అధ్యక్షతన గాదేపాడు గ్రామసభ
◆ మహిళల భద్రత, గ్రామాభివృద్ధి, పారిశుద్ధ్యంపై కీలక తీర్మానాలు



సింగరేణి ప్రతినిధి: (జన సంఘర్షణ) న్యూస్

సింగరేణి మండలం గాదేపాడు గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. సమావేశంలో ఉప సర్పంచ్ ఉపేందర్, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు. గ్రామసభలో మహిళల భద్రతపై విస్తృతంగా చర్చించి, మహిళలు, బాలికల రక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సిబ్బంది ప్రపంచ తల్లిపాల వారోత్సవాల ప్రాధాన్యాన్ని వివరించి, తల్లిపాల వల్ల శిశువులకు కలిగే ఆరోగ్య ప్రయోజనాలను తెలియజేశారు. గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీ.పీ.డి.పీ.)పై చర్చించి, ఈ ఆర్థిక సంవత్సరంలో గ్రామపంచాయతీకి వచ్చే నిధులను ఏయే అభివృద్ధి పనులకు కేటాయించాలనే అంశంపై తీర్మానాలు చేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వచ్చే మూడు నెలల పాటు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు వీధుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని తీర్మానించారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టేందుకు గ్రామంలోని అన్ని వీధుల్లో ఫాగింగ్ నిర్వహించి దోమల మందు పిచికారీ చేయాలని నిర్ణయించారు. గ్రామాభివృద్ధి, ప్రజారోగ్యం, మహిళల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ తీసుకున్న ఈ నిర్ణయాలను గ్రామస్థులు స్వాగతించారు.

# సస్పెండెడ్ ఎస్సై శ్రీకాంత్ గౌడ్ అరెస్ట్..

◆ 14 రోజుల రిమాండ్

నిజామాబాద్ ప్రతినిధి/, ఆగస్టు 1 (జన సంఘర్షణ):

సిరిసిల్ల జిల్లాకు చెందిన సస్పెండెడ్ ఎస్సై శ్రీకాంత్ గౌడ్‌ను నిజామాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌కు చెందిన ఓ యువతిని ఫేస్‌బుక్ ద్వారా పరిచయం చేసుకుని, వివాహం చేసుకుంటానని నమ్మించి లైంగిక దాడికి పాల్పడ్డాడనే ఆరోపణలపై నమోదైన కేసులో ఆయనను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. బాధిత యువతి ఫిర్యాదు మేరకు ఈ ఏడాది ఏప్రిల్‌లో కేసు నమోదు కాగా, అప్పటి నుంచి పరారీలో ఉన్న శ్రీకాంత్ గౌడ్ కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టాయి. సెల్‌ఫోన్ సాంకేతిక ఆధారాలు, నిఘా సమాచారంతో ఆయన కదలికలను గుర్తించిన పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. అనంతరం న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, గతంలో తిమ్మాపూర్ ఎస్సైగా పనిచేసిన సమయంలో ఇసుక అక్రమ రవాణా కేసుల్లో నిందితులకు సహకరించేందుకు భారీ మొత్తంలో నగదు తీసుకున్నారనే ఆరోపణలు కూడా శ్రీకాంత్ గౌడ్‌పై ఉన్నాయి. ఈ వ్యవహారంలో సుమారు రూ.2 కోట్ల మేర అక్రమ లావాదేవీలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో ఉన్నతాధికారులు ఆయనను సస్పెండ్ చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం నమోదైన కేసులపై అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని, విచారణలో లభించే ఆధారాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.



**హైలైట్:.....**

ఫేస్‌బుక్ పరిచయం పేరుతో వివాహం చేస్తానని నమ్మించి లైంగిక దాడి చేశారనే ఆరోపణ. పరారీలో ఉన్న సస్పెండెడ్ ఎస్సైని సాంకేతిక ఆధారాలతో గుర్తించి అరెస్ట్. కోర్టు 14 రోజుల రిమాండ్ విధింపు. ఇసుక అక్రమ రవాణా, ఆర్థిక లావాదేవీల ఆరోపణలపై కూడా విచారణ కొనసాగుతోంది. గమనిక: ఇసుక అక్రమ రవాణా, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన అంశాలు ప్రస్తుతం దర్యాప్తు పరిధిలో ఉన్న ఆరోపణలు మాత్రమే. వాటిపై తుది నిర్ధారణ సంబంధిత విచారణ, న్యాయ ప్రక్రియ పూర్తైన తర్వాతే స్పష్టమవుతుంది.

# అదుపు తప్పిన స్కూల్ బస్సు

◆ తృటిలో తప్పిన ప్రమాదం
◆ 50మంది విద్యార్థుల సేఫ్.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 1 (జన సంఘర్షణ)




మెదక్ పట్టణము నుండి మల్కాపూర్ తండాకు వెళుతున్న ప్రవేటు స్కూల్ బస్సు విద్యార్థులతో బస్సు వాగు వంతెన వద్ద అదుపు తప్పి పక్కకు ఓరిగి పోయింది. డ్రైవర్ చాకచక్యంగా బస్సును అదుపు చేయడంతో బస్సులోని 50మంది విద్యార్థులకు ముప్పు తప్పింది. ఈ సంఘటన శనివారం సాయంత్రం మెదక్ మండలం శివ్వాయిపల్లి గ్రామశివారు పుష్పల వాగు వంతెనపై చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న విద్యార్థులు తల్లిదండ్రులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళనకు గురయ్యారు. విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం లేకుండా బయట పడటంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. మెదక్ పట్టణంలోని డాన్ బాస్కో (ప్రవేటు స్కూల్ బస్సు) బ్రిడ్జ్ వద్ద మట్టి కూరకపోవడంతో స్కూల్ బస్సు పై నుండి కిందికి పడబోతుండగా అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే బ్రేకులు వేసి పిల్లలను కిందికి దించి సురక్షిత ప్రాంతానికి పిల్లలను తీసుకెళ్లారు. విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా స్థానికులు డ్రైవర్ చాకచక్యంగా వారిని కాపాడారు. బస్సు అతివేగంతో ఉంటే పెను ప్రమాదం జరిగే ఉండేదని స్థానికులు తెలియజేశారు. గతంలో రోడ్డు కొట్టుకుపోయిన అధికారుల నిర్లక్ష్యం వల్ల తాత్కాలిక మరమ్మతులు చేపట్టడంతో దుస్థితి నెలకొందని అగ్రహం వ్యక్తం చేశారు.రోడ్డుపై వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొందని జిల్లా కలెక్టర్ స్పందించి వెంటనే శాశ్వత రోడ్డు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.ఆయా గ్రామాలలో సర్పంచులు వెంటనే బ్రిడ్జి పనులు చేపట్టాలని కోరారు.

# నాలుగు రకాల చెత్తను స్పెషల్ కేర్ చెత్తను విడివిడిగా సేకరించాలి

◆ మెదక్ మున్సిపల్ కమిషనర్ నవీన్ సూచించారు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 1 (జన సంఘర్షణ)



ఘన వ్యర్థ పదార్థాల నియమావళి 2026 నిబంధనలను అనుసరించి పట్టణంలోని ప్రతి ఇంటి నుండి నాలుగు రకాల చెత్తను అనగా తడి, పొడి, హానికర స్పెషల్ కేర్ చెత్తను విడివిడిగా సేకరించుటలో భాగంగా ఈ రోజు మెదక్ పట్టణంలోని వార్డ్ నెంబర్ 21, 22 లను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి ఇటీవల మెదక్ మున్సిపాలిటీకి వి సారంగపాణి లేబర్ కాంట్రాక్టర్ డొనేట్ చేసిన చెత్త బుట్టిలను 21, 22 వార్డు లలో చైర్ పర్సన్ కానుగు రాధిక భూపతి రాజు మున్సిపల్ కమిషనర్ నవీన్ కౌన్సిలర్ సమక్షంలో ప్రజలకు చెత్త బుట్టిలను పంపిణీ చేసినారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ.. ప్రతి ఇంటి నుండి నాలుగు రకాల చెత్తను విడివిడిగా ఉంచి మున్సిపల్ వాహనానికి అందించవలెనని ఎవరు కూడా చెత్తను బయట పారవేయకూడదని ప్రజలకు తెలిపినారు. ఇట్టి కార్యక్రమంలో చైర్ పర్సన్‌తో పాటు, 21, 22 వార్డుల గౌరవ కౌన్సిలర్, మున్సిపల్ కమిషనర్, మేనేజర్, ఇంచార్జ్ శానిటరీ ఇన్స్పెక్టర్ ,ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్, వార్డు అధికారులు, సానిటరీ జవాన్లు, ఇతర మున్సిపల్ సిబ్బంది వార్డుల ప్రజలు పాల్గొన్నారు.

# విద్యార్థులను దూషించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగంగ క్షమాపణ చెప్పాలి

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 1 (జన సంఘర్షణ)

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంజనీరింగ్ విద్యార్థులను ఉద్దేశించి క్రిమినల్ అని విమర్శించినందుకు భారతీయ జనతా పార్టీ యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గణేష్ కుండె పిలుపుమేరకు భారతీయ జనతా పార్టీ యువ మోర్చా జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో మెదక్ పట్టణంలో రాందాస్ చౌరస్తా వద్ద రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేశారు.ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, వాల్దాస్ అర్వింద్ మాట్లాడుతూ..రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యావుండి విద్యార్థులను క్రిమినల్స్ సైకోలు విమర్శించడం ఇంతవరకు సమంజసమని అన్నారు. 98 కేసులు ఉన్న మీరు క్రిమినల్ విద్యార్థులు ఎట్లా అవుతురు అని మండిపడ్డారు. పాలన చేతకాక రియంబర్స్ మెంట్ ఇవ్వమని విద్యార్థులు అడుగుతే విద్యార్థులని ఈ విధంగా క్రిమినల్స్ వెస్ట్ సరి కాదన్నారు. విద్యాశాఖ బాధ్యత నీ దగ్గరే ఉంచుకొని విద్యార్థులకు ఎలాంటి న్యాయం చేయకుండా నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకుండా



వ్యవహరించడం బుద్ధిలేనితనం.ఏ ద్దేవా చేశారు.తెలంగాణ విద్యార్థులకు 15000 వేల కోట్లు రీయంబర్స్ మెంట్ ఇవ్వకుండా జల్సాలు చేసుకుంటూ ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని బొంద పెట్టమో విద్యార్థుల జోలికొస్తే అదేవిధంగా నిన్ను ని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూడా బొంద పెడతాం హెచ్చరించారు. పరిపాలన చేతకాకపోతే రాజీనామా లేదంటే మా రియాంబర్స్ మెంట్ ఇవ్వాలని విద్యార్థులని క్రిమినల్స్ అన్నందుకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపిన బీజేవైఎం కార్యకర్తలని అక్రమంగా పోలీస్ స్టేషన్ లకు తరలించి కేసులు పెట్టడం జరిగిందని ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర నాయకులు వాల్దాస్ అరవింద్ గౌడ్ బీజేపీ పట్టణ అధ్యక్షులు నాయిని ప్రసాద్ ప్రేమ్ గణేష్ నర్సింగ్, రవి, రమేష్ గిరి, ప్రవీణ్, మధు బబ్లూ, సన్నీ మహేందర్, శ్యామ్ గౌడ్ చందు, సాయి రాజేష్, సాయి దశరథ్, అనిల్ రాహుల్, సాయి గౌడ్ విక్రమ్, ప్రణయ్ నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.



# సింగరేణి మండలంలో ఆబ్కారీ శాఖ ఉందా... లేదా?

◆ వైన్ షాపుల సిండికేట్‌పై ఎందుకు మౌనం?
◆ ఎమ్మార్పీకి మించి విక్రయాలు.. రాత్రివేళ బెల్ట్ షాపుల దందా..
◆ జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలని ప్రజల డిమాండ్




సింగరేణి ప్రతినిధి: (జన సంఘర్షణ)

సింగరేణి మండలంలో ఆబ్కారీ (ఎక్సైజ్) శాఖ పనితీరుపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరల కంటే రూ.15 నుంచి రూ.30 వరకు అధిక ధరలకు మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలు చాలాకాలంగా వినిపిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో చర్యలు కనిపించడం లేదని స్థానికులు అంటున్నారు.మండలంలోని పలు వైన్ షాపుల్లో ఒకే విధంగా అదనపు ధరలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలతో సిండికేట్ వ్యవస్థ నడుస్తోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బిల్లు ఇవ్వకుండా విక్రయాలు, ఎమ్మార్పీ ఉల్లంఘనలు, వినియోగదారుల ఫిర్యాదులు వెలుగులోకి వస్తున్నప్పటికీ, సంబంధిత అధికారుల స్పందన కనిపించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి 9 గంటల తర్వాత గ్రామాల్లో బెల్ట్ షాపులు యథేచ్ఛగా కొనసాగుతున్నాయనే ఆరోపణలు కూడా ఉన్నాయి. తెలంగాణ ఎక్సైజ్ చట్టం ప్రకారం ఎమ్మార్పీ ఉల్లంఘనలు, లైసెన్స్ నిబంధనల ఉల్లంఘనలు, అక్రమ మద్యం విక్రయాలపై కఠిన చర్యలు తీసుకునే నిబంధనలు ఉన్నప్పటికీ, అమలులో మాత్రం నిర్లక్ష్యం కనిపిస్తోందని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని ప్రత్యేక బృందాలతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, ఎమ్మార్పీకి మించి విక్రయాలు, బెల్ట్ షాపుల నిర్వహణ, బిల్లు లేకుండా సాగుతున్న అమ్మకాలపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. సోమవారం నాటికీ సంబంధిత అధికారులు ఈ అంశంపై స్పందించకపోతే, ఇప్పటివరకు వెలువడిన అన్ని పత్రికా కథనాల కటింగ్‌లతో పాటు ప్రజల ఫిర్యాదులను జిల్లా కలెక్టర్‌కు నేరుగా సమర్పించి ప్రత్యేక విచారణ కోరనున్నట్లు స్థానికులు తెలిపారు. ఇప్పుడు జిల్లా యంత్రాంగం ఈ ఆరోపణలపై ఎలా స్పందిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

# మెదక్ జిల్లా వ్యాప్తంగా ఎవరైనా అక్రమంగా గ్యాస్ రీఫిల్లింగ్ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

- మెదక్ జిల్లాలో అక్రమ గ్యాస్ రిఫిల్లింగ్ సెంటర్లపై సివిల్ సప్లై అధికారుల మెరుపు దాడులు
- 15 డొమెస్టిక్ , 1 కమర్షియల్ సిలిండర్స్ స్వాదినం.
- జిల్లా పౌరసరఫరాల అధికారి నిత్యానంద్.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 1 (జన సంఘర్షణ)


నమ్మదగిన సమాచారం మేరకు 01.08.2026 రోజున, మెదక్ జిల్లా సివిల్ సప్లై ఇన్స్పెక్టర్, రెవిన్యూ సిబ్బంది మరియు పోలీస్ అధికారులతో కలిసి చేగుంట మండలం లోని మక్కరాజుపెట్ గ్రామం లో అక్రమంగా గ్యాస్ రేఫిల్లింగ్ చేస్తున మూడు దుఖణాలలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ తనిఖిలలో వంజరి రాజు కి చెందినా శ్రీ లక్ష్మి నరసింహ స్వామి రిపేర్ షాప్ లో 7 డొమెస్టిక్ సిలిండర్స్, అగతదివిటి సురేష్ కి చెందినా గంగ లైట్ హౌస్ షాప్ లో 2 డొమెస్టిక్ సిలిండర్స్, మహేందర్ కి చెందినా లక్ష్మి నరసింహ సీడ్స్ షాప్ లో 6 డొమెస్టిక్ సిలిండర్స్ ,1 కమర్షియల్ సిలిండర్స్ స్వాదినం చేస్కొని జప్తు చేసినారు. జప్తు చేసిన 15 డొమెస్టిక్ సిలిండర్స్ మరియు 1 కమర్షియల్ సిలిండర్స్ లను చేగుంట లోని దేవి భారత్ గ్యాస్ ఏజెన్సీ కి అప్పగించడం జరిగింది. ఈ ఘటనకు సంబంధించి పై ముగ్గురిపై అత్యవసర వస్తువుల చట్టం, 1955 లోని సెక్షన్ 6-ఏ ప్రకారం కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టనున్నారు. అదేవిధంగా, చేగుంట పోలీస్ స్టేషన్‌లో కూడా వారి మీద క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా పౌర సరఫరాల అధికారి పి. నిత్యానందం మాట్లాడుతూ.. మెదక్ జిల్లా వ్యాప్తంగా ఎవరైనా అక్రమంగా గ్యాస్ రీఫిల్లింగ్ కార్యకలాపాలకు పాల్పడితే డొమెస్టిక్ సిలిండర్స్ లను కమర్షియల్ కొరకు ఉపయోగించిన వారి మీద కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# హిమపాతంలో ప్రముఖ పర్వతారోహకుడు నిర్మల్ పుర్జా మృతి

నిర్మల్/ఆగస్టు 1/(జన సంఘర్షణ)

ప్రపంచ ప్రఖ్యాత నేపాలీ పర్వతారోహకుడు నిర్మల్ "నిమ్స్" పుర్జా (43) పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ పరిధిలోని బ్రాడ్ పీక్ వద్ద జరిగిన హిమపాతంలో మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. గురువారం మధ్యాహ్నం 10 మంది సభ్యులతో కూడిన పర్వతారోహకుల బృందానికి నాయకత్వం వహిస్తున్న సమయంలో ఒక్కసారిగా భారీ హిమపాతం సంభవించడంతో ఈ విషాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో పుర్జాతో పాటు మరో ఐదుగురు పర్వతారోహకులు ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు ధృవీకరించారు. మిగిలిన సభ్యుల కోసం సహాయక బృందాలు గాలింపు చర్యలను కొనసాగిస్తున్నాయి. నిర్మల్ పుర్జా ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రతిభావంతమైన పర్వతారోహకులలో ఒకరిగా గుర్తింపు పొందారు. 2019లో 8,000 మీటర్లకు పైబడిన ప్రపంచంలోని 14 అత్యున్నత శిఖరాలను కేవలం ఆరు నెలల్లోనే అధిరోహించి అరుదైన ప్రపంచ రికార్డును నెలకొల్పి అంతర్జాతీయ ఖ్యాతిని సంపాదించారు. పర్వతారోహణ రంగంలో విశేష సేవలు అందించిన నిర్మల్ పుర్జా ఆకస్మిక మృతి ప్రపంచవ్యాప్తంగా పర్వతారోహకులను, అభిమానులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆయన మరణం సాహస క్రీడల ప్రపంచానికి తీరని లోటుగా పలువురు ప్రముఖులు నివాళులర్పిస్తున్నారు.



# తిర్మలాపూర్‌లో "మన ఊరు - మన భద్రత" కార్యక్రమం విజయవంతం

తిర్మలాపూర్ పోతంగల్ /ఆగస్టు 1:/(జన సంఘర్షణ)

గ్రామాల్లో శాంతిభద్రతలు, ప్రజల్లో భద్రతపై అవగాహన పెంపొందించేందుకు తెలంగాణ పోలీసు శాఖ చేపట్టిన "మన ఊరు – మన భద్రత" కార్యక్రమాన్ని శనివారం తిర్మలాపూర్ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోటగిరి పోలీసు శాఖ సిబ్బంది గ్రామస్థులకు వ్యక్తిగత భద్రత, సైబర్ నేరాల పట్ల అప్రమత్తత, మహిళలు మరియు వృద్ధుల రక్షణ, అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సేవలను ఎలా వినియోగించుకోవాలనే అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామ ప్రజలు పోలీసులతో నేరుగా మాట్లాడి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బోయి సైదవ్వ, ఉప సర్పంచ్ సంజీవ్ కుమార్, వార్డు సభ్యులు అస్మా బేగం, లక్ష్మి, కాశయ్య, విజయ్ ,గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామ ప్రజలతో పోలీసుల అనుబంధాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు భద్రతపై అవగాహన పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు. "పోలీసులు – ప్రజలు కలిసి పనిచేస్తేనే నేరాల నియంత్రణతో పాటు సురక్షిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది" అని కార్యక్రమంలో పేర్కొన్నారు.





# పోటాపోటీగా పాలాభిషేకాలు... బీర్కూర్ చెక్‌డ్యామ్‌పై రాజకీయ క్రెడిట్ పోరు

బీర్కూర్/ఆగస్టు 1/(జన సంఘర్షణ)

కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలంలోని మంజీరా నదిపై నిర్మితమైన చెక్‌డ్యామ్ పూర్తి కావడంతో రాజకీయ పార్టీల మధ్య క్రెడిట్ పోరు నెలకొంది. ఒకవైపు కాంగ్రెస్ నాయకులు చెక్‌డ్యామ్ నిర్మాణం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కృషితో పూర్తైందంటూ పాలాభిషేకాలు నిర్వహించగా, మరోవైపు బీఆర్ఎస్ నాయకులు ఈ ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేసి పనులకు శ్రీకారం చుట్టింది మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వమేనని పేర్కొంటూ ఆయన చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. 2021లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మంజీరా నదిపై చెక్‌డ్యామ్ ప్రాజెక్టు నిర్మాణానికి సుమారు రూ.29 కోట్ల నిధులను మంజూరు చేసింది. అప్పట్లో శాసనసభాపతిగా ఉన్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పనులను ప్రారంభించారు. పలువురు రైతుల దీర్ఘకాలిక డిమాండ్‌గా ఉన్న ఈ చెక్‌డ్యామ్ నిర్మాణం ఆరేళ్ల తర్వాత పూర్తయింది. శనివారం బీర్కూర్ బ్రిడ్జి వద్ద గ్రామ సర్పంచ్ ధర్మతేజ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, రైతులు కలిసి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫొటోకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని చెక్‌డ్యామ్‌కు నిధులు మంజూరు చేసిన కేసీఆర్ దూరదృష్టి వల్లే ఈ ప్రాజెక్టు సాకారమైందని పేర్కొన్నారు. వ్యవసాయాభివృద్ధికి, భూగర్భ జలాల పెరుగుదలకు ఇలాంటి ప్రాజెక్టులు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జుబేర్, ఎలమంచి శ్రీనివాసరావు, అంజిరెడ్డి, నార్ల రత్నకుమార్‌తో పాటు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. రైతులు మాట్లాడుతూ..చెక్‌డ్యామ్ పూర్తికావడం వల్ల మంజీరా పరివాహక ప్రాంతంలోని పంటలకు సాగునీరు అందడమే కాకుండా భూగర్భ జలాలు పెరిగి గ్రామాల వ్యవసాయ రంగానికి శాశ్వత ప్రయోజనం కలుగుతుందని అభిప్రాయపడ్డారు. ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనుల విషయంలో రాజకీయాలకు అతీతంగా పాలకులు కలిసి పనిచేస్తే గ్రామీణాభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందని రైతులు సూచించారు.



# మెదక్ పట్టణములో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో బోనాల జాతర

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 1 (జన సంఘర్షణ)

శివసత్తుల సిగాలు, పోతరాజుల గావు కేకలు డప్పుచప్పుళ్లు యువకుల కేరింతలు మెదక్ పట్టణ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మాత నల్లపోచమ్మ అమ్మవారికి బోనాల ఊరేగింపు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఆదివారం సాయంత్రం మెదక్ పట్టణంలోని అన్ని వీధులకు చెందిన ముదిరాజ్ సంఘం మహిళలు పెద్ద ఎత్తున బోనాలు ఎత్తుకొని అమ్మవారికి ఊరేగింపు నిర్వహించడం జరుగుతుంది. డీజే సౌండ్, డప్పుచప్పుళ్లు, శివ సత్తుల సిగాలు, పోతరాజుల గావుకేకలు, యువకుల నృత్యాల నడుమ అందంగా అలంకరించిన బోనాలను ముదిరాజ్ కుల మహిళలు ఎత్తుకొని ఊరేగింపుగా తరలి వెళ్లి అమ్మవారికి సమర్పించనున్నారు. అమ్మవారికి బోనాలతోపాటు ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. అనంతరం సోమవారం రోజు పట్టణంలోని మాతా బోరంచమ్మ ఆలయం నుండి నల్లపోచమ్మ అవారికి ఫలహారబండి ఊరేగింపు నిర్వహించనున్నారు.





# సర్పంచ్ వరలక్ష్మి రాజు అధ్యక్షతన ఉసిరికాయలపల్లి గ్రామసభ

- గ్రామాభివృద్ధి ప్రణాళిక, మహిళలు-చిన్నారుల సంక్షేమంపై విస్తృత చర్చ

సింగరేణి ప్రతినిధి: (జన సంఘర్షణ) న్యూస్

సింగరేణి మండలం ఉసిరికాయలపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ వరలక్ష్మి రాజు అధ్యక్షతన గ్రామసభ, మహిళల సభ, బాలల సభ నిర్వహించారు. గ్రామాభివృద్ధి ప్రణాళిక రూపకల్పనతో పాటు మహిళలు, చిన్నారుల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. గ్రామానికి అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి, ఈ ఆర్థిక సంవత్సరంలో అందుబాటులోకి వచ్చే నిధులను ప్రాధాన్యత ఆధారంగా ఏయే పనులకు కేటాయించాలనే అంశంపై సభ్యులు తమ అభిప్రాయాలు వెల్లడించారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని సమావేశంలో పేర్కొన్నారు. మహిళల భద్రత, ఆరోగ్యం, సంక్షేమం, చిన్నారుల విద్య, పోషకాహారం, పారిశుధ్యం, తాగునీరు, మౌలిక వసతుల కల్పన వంటి అంశాలపై అవగాహన కల్పిస్తూ తగిన సూచనలు చేశారు. సమావేశంలో ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ సంఘాల ప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# కార్మిక-రైతు హక్కుల పరిరక్షణకు ఆగస్టు 10న మహా ఉద్యమం

- ప్రజలంతా భాగస్వాములు కావాలి: కే నరేంద్ర

సింగరేణి ప్రతినిధి: (జన సంఘర్షణ) న్యూస్

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆగస్టు 10న నిర్వహించనున్న మహా ఉద్యమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ సింగరేణి మండల కన్వీనర్ కే నరేంద్ర పిలుపునిచ్చారు. సింగరేణి మండల భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) సర్వసభ్య సమావేశం మండల కార్యదర్శి అనగా రాంబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కే నరేంద్ర మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజా ఉద్యమాలతోనే తిప్పికొట్టగలమని, ప్రజల హక్కులను కాపాడుకోవడానికి ఐక్య పోరాటాలే మార్గమని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరంలో కీలక ఘట్టమైన భారత్ విడిచి వెళ్లండి ఉద్యమం స్ఫూర్తితో కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. కేంద్రం తీసుకొచ్చిన నాలుగు కార్మిక నియమావళులను రద్దు చేసి, గతంలో అమల్లో ఉన్న 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఎన్నో పోరాటాలతో సాధించుకున్న కార్మిక హక్కులను బలహీనపరిచే చర్యలు సమర్థనీయం కాదని విమర్శించారు.

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచే ప్రయత్నాల వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీతో పాటు పేద వర్గాల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. రైతులకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధ హామీ కల్పించడంలో కేంద్రం విఫలమైందని, విద్యుత్ చట్టం పేరుతో రైతులపై అదనపు భారాలు మోపే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ విధానాల వల్ల రైతులకు అందుతున్న ఉచిత విద్యుత్‌కు కూడా ముప్పు ఏర్పడే పరిస్థితి ఉందన్నారు. దేశ అభివృద్ధికి వెన్నెముకలైన కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల హక్కులను పరిరక్షించేందుకు ఆగస్టు 10న నిర్వహించే మహా ఉద్యమంలో అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కే నరేంద్ర పిలుపునిచ్చారు.

సమావేశంలో సీఐటీయూ సీనియర్ నాయకుడు ముక్క సీతారాములు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు గజ్జల శ్రీనివాస్, ఆధర్ల ఉపేందర్, నారాయణ, వెంకటేశ్వర్లు, రమేష్, చిలుముల కిరణ్, హరియా, దండేపల్లి చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



# భూ రీ సర్వే గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికి నూతన సాఫ్ట్వేర్ రూపకల్పన

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 1 (జన సంఘర్షణ)

భూముల రిసర్వే జరిగిన గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికి నూతన సాఫ్ట్వేర్ ను రూపొందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో ఎన్ఐసి ఆధ్వర్యంలో రూప కల్పన చేస్తున్న నూతన సాఫ్ట్వేర్ పై జాయింట్ డైరెక్టర్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ లక్ష్మీప్రసన్న, ఎన్ఐసి సైంటిస్ట్ సీసీ సంధ్య, లు ఏడి ల్యాండ్ రికార్డ్స్ కిషన్ లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ భూ రీసర్వే జరిగిన గ్రామాల్లో భూ పహాని ఒకటి నుంచి 8 వరకు అంశాలను క్షేత్రస్థాయిలో పరిష్కరించడానికి, నిజమైన పట్టాదారా, మోకా మీద ఉన్నాడా, భూ పహాని, కా స్త్రాలో ఏముంది అనే మొదలగు సమస్యల పరిష్కారానికి ఎన్ఐసి ఆధ్వర్యంలోఏర్పాటుచేయనున్న నూతన సాఫ్ట్వేర్ను ఒక వారం రోజుల్లో అందుబాటులోకి చేస్తున్నామన్నారు. మెదక్ మండలంలోని కోముటూరు గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు కింద డిటిటల్ సాఫ్ట్వేర్ సర్వే ప్రారంభించడానికి ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి భూ సమస్య లేకుండా చేస్తామన్నారు. అనంతరం మెదక్ మండలం కోమటూరు గ్రామాన్ని క్షేత్రస్థాయిలో సర్వే డిపార్ట్మెంట్ అధికారులు పరిశీలించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# గుండెపోటు అనుకుని ఎడాపెడా సీపీఆర్..

❑ ఆసుపత్రిలో బిగ్ ట్విస్ట్!

మధ్యప్రదేశ్ మొరెనా జిల్లా/ఆగస్టు1/(జన సంఘర్షణ)

ఓ ప్రాణాన్ని కాపాడాలన్న మంచి ఉద్దేశంతో చేసిన ప్రయత్నం.. చివరకు అనుకోని గాయాలకు కారణమైంది. రోడ్డుపై ఒక్కసారిగా కుప్పకూలిన ఓ మహిళా ఉపాధ్యాయురాలికి గుండెపోటు వచ్చిందని భావించిన ఇద్దరు యువకులు, ఆలస్యం చేయకుండా ఆమెకు సీపీఆర్ అందించారు. అయితే, ఆసుపత్రికి తరలించిన తర్వాత వైద్యులు చేసిన పరీక్షల్లో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఆమెకు గుండెపోటు రాలేదని, మరో కారణంతోనే స్పృహ తప్పి పడిపోయినట్లు తేలింది. అంతేకాకుండా, సరైన పద్ధతిలో కాకుండా చేసిన సీపీఆర్ కారణంగా ఆమెకు రెండు పక్కటెముకలు విరిగినట్లు వైద్యులు గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సంఘటనతో అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ చేయడం ఎంత ముఖ్యమో, అదే సమయంలో సరైన శిక్షణ



లేకుండా చేయడం వల్ల ప్రమాదాలు కూడా జరిగే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది.

**నిపుణుల సూచన:** సీపీఆర్ అనేది ప్రాణాలను కాపాడగల అత్యవసర చికిత్స. అయితే, గుండె స్పందన ఆగినట్లు లేదా శ్వాస నిలిచినట్లు నిర్ధారణ అయినప్పుడే, సరైన శిక్షణతో లేదా అత్యవసర సేవల మార్గదర్శకత్వంలో చేయడం ఉత్తమమని వైద్యులు సూచిస్తున్నారు.

# అన్నా భౌ సాటే జయంతి సందర్భంగా ఘన నివాళులు

**జన సంఘర్షణ ప్రత్యేక కథనం...**

పొతంగల్/ఆగస్టు 1/(జన సంఘర్షణ)

సామాజిక న్యాయం, సమానత్వం, శ్రమజీవుల గౌరవం కోసం కలం పట్టిన మహనీయ రచయిత అన్నా భౌ సాటే జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పిద్దాం. అన్నా భౌ సాటే ప్రజా రచయితగా విశేష గుర్తింపు పొందారు. పేదలు, దళితులు, కార్మికుల జీవితాలను తన రచనల్లో హృద్యంగా ప్రతిబింబిస్తూ సమాజానికి దిశానిర్దేశం చేశారు. ఆయన రచనలు కేవలం కథలే కాదు, అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీకలుగా నిలిచాయి. దళితుల విముక్తికి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచనలు మార్గదర్శకమని విశ్వసించిన అన్నా భౌ సాటే, తన ప్రసిద్ధ "ఫకీరా" నవలను అంబేద్కర్ గారి అచంచల త్యాగాలకు అంకితం చేశారు. ఇది ఆయన అంబేద్కర్‌పై ఉన్న అపార గౌరవానికి నిదర్శనం. "ఈ భూమి పురాణాల్లో చెప్పిన శేషనాగు తలపై నిలబడలేదు; అనామక కార్మికులు, దళితుల కఠోర శ్రమపై నిలబడింది" అనే ఆయన మాటలు శ్రమజీవుల గొప్పతనాన్ని చాటిచెప్పే చిరస్మరణీయ సందేశంగా నిలిచాయి. దళిత సాహిత్య ఉద్యమానికి బలమైన పునాది వేసిన ప్రముఖుల్లో అన్నా భౌ సాటే ఒకరు. కార్మికులు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడారు. సమాజంలో కుల వివక్ష కొనసాగుతున్నంత కాలం దేశానికి నిజమైన స్వాతంత్ర్యం రాదని, ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు, గౌరవం లభించినప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం సాకారమవుతుందని దేశ, విదేశీ వేదికలపై ధైర్యంగా ప్రకటించారు. కష్టాల్లో జన్మించినా, అచంచల సంకల్పం, ప్రతిభ, కృషితో ప్రపంచం గుర్తించే స్థాయికి ఎదగవచ్చని తన జీవితంతో నిరూపించిన మహనీయుడు అన్నా భౌ సాటే. అన్నా భౌ సాటే జయంతి సందర్భంగా ఆ మహనీయునికి ఘన నివాళులు అర్పిస్తూ... వారి ఆశయాలు చిరస్థాయిగా నిలిచి, సమానత్వం-- సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆకాంక్షిస్తూ హృదయపూర్వక జయంతి శుభాకాంక్షలు.




# కుక్కల నియంత్రణకు నడుం బిగించిన బల్దియా!

❑ ప్రత్యేక బోన్లు, వలతో పట్టి అడవికి తరలింపు
❑ మున్సిపల్ చైర్ పర్సన్ ఆదేశాల మేరకు చర్యలు హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

బాన్సువాడ/ఆగస్టు 1/ (జన సంఘర్షణ)

బాన్సువాడ: పట్టణంలో పెరిగిపోతున్న వీధి కుక్కల బెడదకు మున్సిపాలిటీ చర్యలు చేపట్టింది. ఇటీవల కుక్కల దాడిలో 12 మంది చిన్నారులు గాయపడి ఆసుపత్రుల పాలైన విషయం విదితమే. దీంతో బీఆరెస్ తో నాయకులు, బాధితులతో కలిసి మున్సిపాలిటీ ముందు ధర్నా చేశారు. వెంటనే స్పందించిన మున్సిపల్ చైర్పర్సన్ కాసుల విజయ బాలరాజు కుక్కల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికకు ఆదేశాలు జారీ చేశారు. ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది శనివారం నుంచి ప్రత్యేక వలలు, బోన్లతో వీధి కుక్కలను పట్టుకునే పనులు ప్రారంభించారు. పట్టణంలో స్వైర విహారం చేస్తున్న కుక్కలను వాహనాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక బోన్లలో బంధించి అడవి ప్రాంతాల్లో వదిలేందుకు ఏర్పాట్లు



చేశారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. చైర్పర్సన్ కాసుల విజయ బాలరాజు మాట్లాడుతూ.. కుక్కలతో పాటు పట్టణంలో కోతుల బెడద కూడా ఉందని, వాటి నియంత్రణకు కూడా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. వీధి కుక్కలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం స్టెరిలైజేషన్ చికిత్స, యాంటీ రేబిస్ టీకాల కోసం తరలించనున్నామని వెల్లడించారు. పట్టణ వ్యాప్తంగా ఉన్న వీధి కుక్కలను తరలిస్తామని, 15 రోజుల పాటు ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కోతుల నియంత్రణకు సంబంధిత శాఖలతో సమన్వయం చేసి అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజలు కొద్ది రోజుల పాటు అప్రమత్తంగా ఉండాలని, చిన్నారులను ఒంటరిగా బయటకు పంపవద్దని విజ్ఞప్తి చేశారు. ఇళ్ల పరిసరాల్లో ఆహార వ్యర్థాలు బయట వేయకుండా పరిశుభ్రత పాటించాలని సూచించారు. కుక్కలు, కోతుల బెడదతో పాటు పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి కూడా మున్సిపాలిటీ అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని చైర్పర్సన్ కాసుల విజయ బాలరాజు అన్నారు. ఈ చర్యలపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

# రెండేళ్ల ప్రభుత్వ పాలనపై ప్రజల్లో సంతృప్తి

❑ ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్

చిత్తూరు ఆగస్టు 1 (జన సంఘర్షణ)

చిత్తూరు రూరల్ : గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో సంతృప్తి వ్యక్తం అవుతుందని, ఇంటింటికి వెళ్తున్న సమయంలో ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. "రెండేళ్ల ప్రభుత్వ పాలన - ఇంటింటి ప్రచారం" కార్యక్రమంలో భాగంగా శనివారం చిత్తూరు రూరల్ మండలం అనంతాపురం, శెట్టితంగాల్, పెరుమాళ్ల కండ్రిగ, సిద్ధంపల్లి గ్రామాల్లో పర్యటించారు. స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. గడిచిన రెండేళ్లలో చిత్తూరు నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇంటింటి ప్రచారం కార్యక్రమంలో భాగంగా ప్రజల వద్దకు వెళుతున్న సమయంలో వారి నుంచి అపూర్వ స్పందన వస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల ప్రజల సంతృప్తి, సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పరిశీలకులు కుమారి, మండల పార్టీ అధ్యక్షులు రఘు, కూటమి నాయకులు చంద్ర ప్రకాష్, జయచంద్ర నాయుడు, సీకే లావణ్య, మోహన్ రాజ్, అనురాధ గిరీ, శ్యామ్, మంజూష్, మేసక్, శశికర్ బాబు, కందస్వామి స్థానిక తెదేపా కమిటీల సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



## లక్ష్మాపూర్ గ్రామ సర్పంచ్ నవీన్ గౌడ్ ఇటీవల యాక్సిడెంట్ కావడంతో హాస్పిటల్లో చికిత్స పొంది ఇంటికి చేరుకున్నారు.

❑ ఆయనను కాంగ్రెస్ పార్టీ నాయకుడు, లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్ ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 1 (జన సంఘర్షణ)




మెదక్ జిల్లా రామాయంపేట మండలం లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన గ్రామ సర్పంచ్ నవీన్‌కి ఇటీవల ఆక్సిడెంట్ కావడంతో హాస్పిటల్లో చికిత్స పొంది ఇంటికి చేరుకున్నారు. ఇట్టి సమాచారాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు, లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్ వారి ఊరికి చేరుకొని యాక్సిడెంట్ కు గల కారణాలను ఆరోగ్య సమస్య గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## హంగర్గ ఫారం శివారులో మళ్లీ పేకాట జోరు..!

❑ స్పెషల్ పార్టీ దాడి జరిగినా ఆగని జూదం
❑ అధికారుల చర్యల కోసం గ్రామస్థుల విజ్ఞప్తి

పోతంగల్/ఆగస్టు 1/(జన సంఘర్షణ)






పోతంగల్ మండల కేంద్రంలోని హంగర్గ ఫారం గ్రామ శివారులోని పంట పొలాల్లో పేకాట ఆటలు మళ్లీ జోరుగా సాగుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల నిజామాబాద్ స్పెషల్ పార్టీ చీతా టీం దాడులు నిర్వహించినప్పటికీ, జూదం పూర్తిగా నిలిచిపోలేదని స్థానికులు చెబుతున్నారు. రోజుకు లక్ష రూపాయలకు పైగా నగదుతో పేకాట జరుగుతోందని, దీంతో గ్రామ యువత తప్పుదోవ పట్టే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాలను అడ్డాగా చేసుకుని ఈ కార్యకలాపాలు సాగుతున్నాయని ఆరోపిస్తున్నారు.

గ్రామంలో అక్రమ పేకాటపై పోలీసులు, సంబంధిత అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, తరచూ దాడులు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమ జూదాన్ని ప్రోత్సహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని గ్రామంలో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**అధికారులకు హెచ్చరిక:**

అక్రమ పేకాట, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను ఏమాత్రం ఉపేక్షించకుండా, నిరంతర తనిఖీలు నిర్వహించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీంతో యువత భవిష్యత్తు కాపాడటంతో పాటు గ్రామాల్లో శాంతిభద్రతలు కూడా పరిరక్షించబడతాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## 60 ఏళ్లయినా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన డ్యాములు చెక్కుచెదరలేదు

❑ రెండు రోజుల్లో నీటి విడుదలపై స్పష్టమైన ప్రకటన చేస్తాం..
❑ ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ప్రకటన

నిజామాబాద్ బ్యూరో /ఆగస్టు 1/(జన సంఘర్షణ)



ప్రాజెక్టుల సందర్భంలో భాగంగా శనివారం ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, వివేక్ నిజామాబాద్ జిల్లాలో పర్యటించారు. పర్యటంలో భాగంగా గోదావరి నదిపై నిర్మించిన శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టును సందర్శించారు. ప్రాజెక్టులోకి ఎగువ భాగంలో కురిసిన వర్షాల వల్ల వరద నీరు పెద్ద ఎత్తున చేరడంతో మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 60 ఏళ్ల క్రితం నిర్మించిన ప్రాజెక్టులు ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి వెల్లడించారు. బారాస ప్రభుత్వంలో లక్షల కోట్లు వెచ్చించి నిర్మించిన కాలేశ్వరం డ్యామ్ కూలిపోయిందని, మేడిగడ్డ, సుందిళ్ల, బ్యారేజీలను నింపటం లేదని బారాస నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ,బారాస నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. తమ ప్రభుత్వం ఈ మూడు బ్యారేజ్ లను పునరుద్ధరణ చేయడానికి కట్టుబడి ఉందామని మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు. రెండు రోజుల్లో నీటి నీ విడుదల పై స్పష్టమైన ప్రకటన చేస్తామని ఈ సందర్భంగా మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి రైతులకు భరోసా కల్పించారు. ప్రస్తుతానికి శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరుతుందని మంత్రి పేర్కొన్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
ఆదివారం
02 ఆగస్టు 2026

# చెక్ డాం నిర్మాణం పూర్తి..

- రైతుల్లో నూతన ఉత్సాహం
- హనుమాన్ ఆలయం వద్ద సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం

బీర్కూర్ /ఆగస్టు 1/(జన సంఘర్షణ)




మంజీరా పర్యాయక ప్రాంతంలో భూగర్భ జలాలను పెంపొందించాలని ఉద్దేశంతో బాన్స్వాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కృషి మేరకు మంజీరా నదిలో చెక్ డాం నిర్మాణాలు చేపట్టారు. బీర్కూర్ మంజీరా నదిలో పదిహేను వందల మీటర్ల పొడవు తో చెక్ డాం నిర్మాణం పనుల కోసం 2021లో అప్పటి శాసనసభాపతి ప్రస్తుత ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కృషి ఫలితంగా 29 కోట్ల రూపాయలు మంజూరు కాగా, వివిధ కారణాలవల్ల కొంత నిర్మాణంలో జాప్యం జరిగినప్పటికీ, ఈ ఏడాది కాంట్రాక్టర్ ప్రత్యేక శ్రద్ధచూపి చెక్ డాం నిర్మాణం పనులు పూర్తి చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు మంజీరా నదిలో నీరు ప్రవహించడంతో చెక్ డాం నుంచి మూడు కిలోమీటర్ల వరకు నీరు నిలిచిపోవడంతో రైతన్న ఎంతో సంబరపడిపోతున్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీ, రైతుల ఆధ్వర్యంలో బీర్కూర్ హనుమాన్ ఆలయం వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఆగ్రో పరిశ్రమల చైర్మన్ కాసుల బాలరాజ్ చిత్రపటాలకు రైతులు పాలాభిషేకం చేశారు. శీనన్న నాయకత్వం వర్ధిల్లాలి అంటూ కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రైతు పక్షపాతి గా పేరుగాంచిన పోచారం శ్రీనివాస్ రెడ్డి రైతుల కోసం ఎంతో కృషి చేస్తారని, ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు వెల్లడించారు. రైతులకు భవిష్యత్తులో సాగునీటి డోకా ఉండకూడదని ఉద్దేశంతో మంజీరా నదిలో నిర్మాణం చేపట్టిన చెక్ డాం నిర్మాణం పనులు పూర్తయి ఇటీవల కురిసిన వర్షాలకు పొంగి పొర్లుతుందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి చేసిన కృషి ఫలితంగా ప్రస్తుతం మంజీరా పర్యాయక ప్రాంతంలో భూగర్భ జలాలు పెరుగుతాయని కాంగ్రెస్ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి కృషి మేరకు చెక్ డాం నిర్మాణం చేపట్టడం వల్ల రైతులకు శాశ్వత సాగునీటి డోకా లేకుండా పోతుందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ యామ రాములు, యువజన నాయకుడు శశికాంత్, పట్టణ అధ్యక్షుడు రఘు, మాజీ ఎంపీపీలు ఇండ్ల విజయ ప్రకాష్, టీ ,రఘు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకర్, సహకార సంఘం అధ్యక్షులు కే గాంధీ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అంబలి బస్వరాజ్, ఆనంద్ కుమార్, పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.

# విషాదం.. పిల్లర్ గుంతలో పడి చిన్నారి మృతి

- తల్లి వెంట బయటకు వచ్చిన రెండేళ్ల చిన్నారి..
- క్షణాల్లోనే గుంతలో పడి మృతి

కామారెడ్డి/ఆగస్టు 1/ (జన సంఘర్షణ):





కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం ఎర్రపహాడ్ గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఇంటి సమీపంలో నిర్మాణం కోసం తీసిన పిల్లర్ గుంతలో పడి రెండేళ్ల చిన్నారి మృతి చెందింది. తల్లి బయటకు వెళ్తున్న సమయంలో ఆమె వెనుకే వచ్చిన చిన్నారి ప్రమాదవశాత్తు గుంతలో పడిన దృశ్యాలు నిఘా కెమెరాల్లో నమోదయ్యాయి. చిన్నారి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు నిఘా కెమెరాల దృశ్యాలను పరిశీలించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. అప్పటికే చిన్నారి గుంతలో పడిపోయినట్లు గుర్తించారు. ఈ దుర్ఘటనతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

**చిన్నారుల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి!**

ఇళ్ల సమీపంలో నిర్మాణ పనుల కోసం తీసిన పిల్లర్ గుంతలు, కాలువలు, బావులు, నీటి గుంతలను ఎట్టి పరిస్థితుల్లోనూ తెరిచి ఉంచకూడదు. వాటి చుట్టూ రక్షణ కంచెలు ఏర్పాటు చేయడంతో పాటు ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. చిన్నారులు ఆడుకునే సమయంలో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు వారిపై నిరంతరం నిఘా ఉంచాలి. క్షణకాల నిర్లక్ష్యం కూడా ఇలాంటి విషాద ఘటనలకు దారితీసే అవకాశం ఉంది. ఈ ఘటనను దృష్టిలో ఉంచుకుని గ్రామీణ ప్రాంతాల్లో నిర్మాణదారులు, ఇంటి యజమానులు భద్రతా చర్యలు తప్పనిసరిగా పాటించాలని స్థానికులు కోరుతున్నారు.

# తెలంగాణ ఉద్యమ యోధుడు పెద్ది సుదర్శన్ రెడ్డికి కోటగిరిలో ఘన నివాళులు

కోటగిరి/ఆగస్టు 1/(జన సంఘర్షణ)

తెలంగాణ ఉద్యమంలో విశిష్ట పాత్ర పోషించిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి పట్ల నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల బీఆర్ఎస్ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శనివారం కోటగిరి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం రెండు నిమిషాల మౌనం పాటించి ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు తెల్ల రవికుమార్, మోరే కిషన్, ఎత్తొండ దేవేందర్ మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి పోషించిన పాత్ర ఎన్నటికీ మరువలేనిదని కొనియాడారు. ఉద్యమం కోసం ఆయన చేసిన త్యాగాలు, ప్రజల హక్కుల సాధన కోసం చేసిన నిరంతర పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. వరంగల్ గడ్డపై ఎన్నో సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ, ఆర్థిక బలం కంటే ప్రజల విశ్వాసం, ఉద్యమ స్ఫూర్తినే నమ్ముకుని ముందుకు సాగిన అరుదైన నాయకుడిగా పెద్ది సుదర్శన్ రెడ్డి గుర్తింపు పొందారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కోసం జరిగిన ప్రతి కీలక దశలో ఆయన చురుకైన పాత్ర పోషించి ఉద్యమకారులకు స్ఫూర్తిగా నిలిచారని గుర్తు చేశారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను తన సమస్యలుగా భావించి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసిన ప్రజానాయకుడిగా ఆయనను కొనియాడారు. నర్సంపేట ప్రజలతో పాటు తెలంగాణ సమాజం ఆయన సేవలను ఎప్పటికీ మరచిపోదని, యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ నివాళి కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు,



ఉద్యమకారులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. "ప్రజల కోసం జీవించిన మహానాయకులు శరీరంగా దూరమైనా, వారి ఆశయాలు ప్రజల హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోతాయి. తెలంగాణ ఉద్యమ చరిత్రలో పెద్ది సుదర్శన్ రెడ్డి సేవలు చిరస్మరణీయంగా నిలుస్తాయి. ఆయన ఆశయాలను కొనసాగించడమే ఆయనకు అందించే నిజమైన నివాళి."

# గోల్డ్ షాపులో చోరీ.. దొంగ ఎవరో తెలిస్తే షాక్!

- రూ.10 లక్షల బంగారం మాయం..
- పోలీసులకే షాకిచ్చిన 'చోర ఎలుక'!

కర్ణాటక/ఆగస్టు 1/(జన సంఘర్షణ):

కర్ణాటకలోని తుమకూరులో వింత చోరీ ఘటన వెలుగులోకి వచ్చింది. ఓ బంగారు ఆభరణాల దుకాణంలో బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు. అయితే ముందుగా దుకాణంలోని నిఘా కెమెరాల దృశ్యాలను పరిశీలించగా అసలు 'దొంగ' ఎవరో చూసి సిబ్బంది అవాక్కయ్యారు. నిఘా కెమెరాల్లో ఓ ఎలుక ఒక్కొక్కటిగా బంగారు ఉంగరాలు, ఆభరణాలను నోట కరుచుకుని తీసుకెళ్తున్న దృశ్యాలు కనిపించాయి. దీంతో సిబ్బంది ఆ ఎలుకను అనుసరించగా.. చివరకు దాని బొరియలో 10 బంగారు ఉంగరాలు, 3 బంగారు గొలుసులు లభించాయి. వీటి విలువ సుమారు రూ. 10 లక్షలు ఉంటుందని తెలిపారు.

**దొంగలకు ఇదే పోలీసుల ఘాటు హెచ్చరిక!**



మనుషులైతే తప్పించుకోవడానికి ఎన్నో మార్గాలు వెతుకుతారు.. కానీ ఈ 'చోర ఎలుక' మాత్రం నిఘా కెమెరాలకు చిక్కకుండా ఉండలేకపోయింది! దొంగతనాలకు పాల్పడేవారు ఎంత తెలివిగా వ్యవహరించినా పోలీసుల నిఘా నుంచి తప్పించుకోవడం అంత సులువు కాదని ఈ ఘటన మరోసారి స్పష్టం చేస్తోంది. బంగారం, డబ్బు ఆశతో అక్రమాలకు పాల్పడే వారు ఇకనైనా జాగ్రత్తపడాలి. చట్టాన్ని ఉల్లంఘించి దొంగతనాలకు పాల్పడితే పోలీసుల చర్యలు తప్పవు. దొరికితే కఠిన పరిణామాలు ఎదుర్కోవాల్సిందే!

# బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేపై లైంగిక వేధింపుల కేసు.. !

హైదరాబాద్/ఆగస్టు 1/(జన సంఘర్షణ)

హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుపై లైంగిక వేధింపుల ఆరోపణలతో కేసు నమోదైంది. పెళ్లి పేరుతో తనను మోసం చేసి వేధించారని ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఫిర్యాదు వివరాల ప్రకారం.. ఇంటర్వ్యూ పేరుతో తనను ఫ్లాట్‌కు పిలిచి లైంగిక దాడికి పాల్పడ్డారని బాధితురాలు ఆరోపించింది. అనంతరం పెళ్లి చేసుకుంటానని నమ్మించి తనతో సన్నిహిత సంబంధం కొనసాగించారని, ఆ తర్వాత మోసం చేశారని ఫిర్యాదులో పేర్కొంది. తనకు తెలియకుండా ప్రైవేట్ వీడియోలు చిత్రీకరించారని, వాటిని




ఉపయోగించి ఇబ్బందులకు గురిచేశారని బాధితురాలు ఆరోపించింది. అలాగే రియల్ ఎస్టేట్ పెట్టుబడుల పేరుతో తన నుంచి భారీగా డబ్బులు తీసుకున్నారని కూడా ఫిర్యాదులో పేర్కొంది. అంతేకాకుండా తన మొబైల్ ఫోన్‌కు యాక్సెస్ పొంది, తన స్నేహితురాలితో కూడా ఇదే విధంగా పరిచయం పెంచుకునేందుకు ప్రయత్నించారని బాధితురాలు ఆరోపించింది. ఈ ఫిర్యాదుపై జూలై 26వ తేదీన పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. భారతీయ న్యాయ సంహిత (దీచీూ)లోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, ఆరోపణలపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు ఆధారాల సేకరణ, బాధితురాలి వాంగ్మూలం, ఇతర సంబంధిత వివరాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఆరోపణలపై రేగా కాంతారావు స్పందన తెలియాల్సి ఉంది.

# విందూరులో యువకుడు దారుణ హత్య

- విచారణ చేపట్టిన పోలీసులు

మనుబోలు. 1.8.2026 (జన సంఘర్షణ)

గూడూరు మండల పరిధిలోని విందూరు గ్రామంలోనీ ప్రాథమిక పాఠశాల మిద్దెపై షాహుల్ (21 ) అనే యువకుడుని గుర్తు తెలియని వ్యక్తులు గొంతు కోసి హత్య చేసిన సంఘటన జరిగింది. స్థానికుల సమాచారం మేరకు నెల్లూరు జిల్లా గూడూరు రూరల్ లోని విందూరు గ్రామం ని ప్రాథమిక పాఠశాల మిద్దె పై అదే గ్రామానికి చెందిన షాహుల్ అనే 21 ఏళ్ల యువకుడు శనివారం తీవ్ర రక్త శ్రావంతో మరణించి ఉన్నట్టు స్థానికులు గుర్తించారు,ఎవరో గొంతుకోసి హత్యచేసినట్టు ఘటనా స్థలం ను బట్టి తెలుస్తుంది. సమాచారం అందుకున్న గూడూరు రూరల్ పోలీసు సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మృతిపై ఆరా తీస్తున్నారు.



Printed, published and owned by **Rachamallu Madhavi** Printed at **Kranthi Printing Press**, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : **Rachamallu Madhavi**. **RNI Reg No :tel/2024/89323,** Cell 6305026524, Email:janasangarshana@gmail.co